# హాస్యానందం


సంపూర్ణ హాస్య మాస పత్రిక

తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక

అక్టోబర్-2021
వెల: రూ.20



శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు
అంశంతో నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
బహుమతి పొందిన
కథల ప్రత్యేక సంచిక



# హాస్యానందం సంపాదకులు శ్రీ పి.రాముగారికి
# జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్- అక్కినేని పురస్కారం




27,సెప్టెంబర్,2021న హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గానసభలో, అక్కినేని నాగేశ్వరరావు 98వ జయంతి సందర్భంగా **జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్** నిర్వహించిన **అక్కినేని పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది.** వివిధ రంగాలకు చెందిన 5గురికి ఈ పురస్కారాలను అందజేసారు. ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ చిల్లా రాజశేఖర రెడ్డి, యువకళావాహిని అధ్యక్షులు శ్రీలంక లక్ష్మీనారాయణ, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామరాజు శ్రీనివాసరావు, శ్రీ వేద ధార్మిక సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కొండపాక కృష్ణమాచార్య అతిథులుగా ఈ సభలో పాల్గొన్నారు. వీరందర్నీ సమన్వయం చేసి సభను దిగ్విజయంగా నిర్వహించారు సంస్థ చైర్మన్ లయన్ శ్రీ గుదిబండి వెంకటరెడ్డి.

ముఖ్య అతిథులతో
పురస్కార గ్రహీతలు
(ఎడమ నుండి కుడికి)
**శ్రీ పి.విజయకుమార్**
(ఫొటోగ్రఫీ)
**శ్రీ పి.రాము**
(పత్రికారంగం)
**శ్రీ బొప్పన నరసింహారావు**
(నాటకాల ప్రదర్శన నిర్వాహణ)
**శ్రీమతి బి.నిర్మలా ప్రభాకర్**
(నృత్యం)
**శ్రీమతి కత్తుల లక్ష్మీరవీందర్**
(వర్ధన్ అనాథ బాలికల ఆశ్రమ నిర్వహణ)



స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్ఛమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక


**Publisher& Editor- Ramu.P**

**Full Pillar** :Bnim

**Cartoon Feature Editor**:Bachi

**అక్టోబర్-2021**

**19వ సంవత్సరం ✦ 208 వ సంచిక**

**ముఖచిత్రం: కీర్తి సురేష్**

**కార్టూన్: జయదేవ్**

**D.T.P:** P. Ramalakshmi, 9440304993

**Digital Media Director:** Surya Suryatoons

**సంవత్సర చందా-రూ.300/-(పోస్టల్ చార్జీలతో)**

**2 సంవత్సరాల చందా-రూ.500/-(పోస్టల్ చార్జీలతో)**

**జీవిత చందా- రూ.5000/-లు**



Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
Ph : 9849630637



**Hyderabad & Secunderabad Distributors:**
M.Panduranga, **Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.



**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.



**Well Wishers:**
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana


## హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు...**
**హాస్యప్రియులకు విజయదశమి శుభాకాంక్షలు.**

లోకంలో అందరూ అన్ని పనులు చేయలేరు... ఒకొక్కరు ఒక్కో పనితీరులో నిష్ణాతులై ఉంటారు.

కొంతమంది నేను లేకపోతే ఈ 'పని' అయ్యేదే కాదు అని ప్రగల్భాలు పలుకుతుంటారు. అది నిజంగా వారి భ్రమ మాత్రమే. వాళ్ళు లేకపోయినా ఆ పని ఆగదు! కాస్త ఆలస్యమవుతుందేమో అంతే!

మరికొంతమంది పక్కవారికి సహాయం చేసి 'నా వల్లే' అయింది అని లోకమంతా చాటుతుంటారు. అదీ తప్పే! సాయం చేశానని చెప్పడం వేరు, నా వల్లే అయిందని చెప్పడం వేరు. మనం అలా చాటడం వలన ఎదుటివారి అహం దెబ్బ తిని మనుషుల మధ్య దూరం పెరుగుతుంది అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

మనం సంఘజీవులం ఒకరికొకరంగా ఉంటే... రేపు మనకొచ్చే అవసరానికి మన నుంచి సహాయం పొందే వాళ్ళే మనకండగా ఉండటానికి అవకాశముంది.

చిత్తశుద్ధితో పనులు చేస్తే మంచి గుర్తింపు కూడా వస్తుంది. అయితే ఇది 'నేను' బాగా చేయగలను అనే భావం మంచిదే కానీ... 'నీ' వల్ల కాదు అనే అహంకారం ఎదుటి వాళ్ళను మనకి దూరం చేస్తుంది.

అందరికీ మంచి మంచి ఆలోచనలు కలిగించాలని...
విజయాలు చేకూర్చాలని విజయదశమి సందర్భంగా
జగన్మాతను ప్రార్థిస్తూ...
అందరూ ఆనందంగా...
ఆరోగ్యంగా ఉండాలని
కోరుకుంటూ...

Ramu.P





Smile in Every Page...Satisfaction in Every Smile

నవ్వుకు కారణం ఆనందం!

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

**'ప్రవాసాంధ్రులు' అంశంతో నిర్వహించిన కథల పోటీల్లో బహుమతి పొందిన కథలు**


**మొదటి బహుమతి**

| | | |
|---|---|---|
| అమెరికల | నెల్లుట్ల రమాదేవి | -11 |

**రెండవ బహుమతి**

| | | |
|---|---|---|
| అమెరికాలో పని'మనీ'షి | అనిశెట్టి సతీష్ కుమార్ | -19 |

**ప్రత్యేక బహుమతులు**

| | | |
|---|---|---|
| 'బోబోరె' | డాక్టర్ తేజస్వి పారుపూడి | -21 |
| పూర్ణమ్మత్తా -పోర్లు దండాలు | ఆదూరి.హైమావతీశ్రీనివాసరావు | -24 |
| ప్రవాస 'ఆంధ్రుడు' | యం. రమేష్ కుమార్ | -28 |
| నామకరణం | కొమ్ముల వెంకట సూర్యనారాయణ | -30 |
| సుబ్బలక్ష్మి గర్భాడాన్స్ | బలభద్రపాత్రుని ఉదయ శంకర్ | -34 |
| ఎంత బాగుంటుంది..! | జి.రంగబాబు | -36 |
| ఏగానీ గుంటకి... | ద్విభాష్యం రాజేశ్వర రావు | -38 |
| అదో ప్రపంచం | ఎం.హనుమంతరావు | -42 |
| భిన్నత్వంలో ఏకత్వం | జొన్నలగడ్డ రామలక్ష్మి | -44 |
| దుబాయ్ దుర్గమ్మ | కె.వి. లక్ష్మణరావు | -48 |

## శీర్షికలు

| | | |
|---|---|---|
| ప్రోత్సాహక బహుమతులు | | -6 |
| 'పన్'చదార చిలుకలు | శంకరనారాయణ | -9 |
| ఫన్‌పంచ్ | గుండు సుదర్శన్ | -26 |
| తర్కారావు కథలు | గంగాధర్ వడ్లమన్నాటి | -32 |
| మాటల్లేవ్... | | -40 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -46 |

## సీరియల్స్

| | | |
|---|---|---|
| లక్కీఫెలో | జి.రవికిరణ్ | -14 |

## ప్రత్యేకం

| | | |
|---|---|---|
| అనంత భావాలకు వేదికలు కార్టూన్లు | | -18 |
| దేవుడు కనబడడు | ఉత్తమ్ | -50 |

**కార్టూన్ శీర్షికలు**

| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -12 |
| నవ్వే ఆనందం | -గోపాలకృష్ణ | -17 |
| లోకం తీరు | -కృష్ణ | -22 |
| మోకన్న | -ప్రేమ్ | -35 |


**కథలకు బొమ్మలు:** వెంకట్

## ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు

- జయదేవ్
- ఉత్తమ్
- ఏవీఎమ్
- సరసి
- గోపాలకృష్ణ
- రామ్‌శేషు
- కృష్ణ
- ప్రేమ్
- శర్మ
- సుందరం
- టి.ఆర్.బాబు
- దాస్
- తోపల్లి ఆనంద్
- హరగోపాల్
- ప్రభాకర్
- వందన శ్రీనివాస్
- సత్య
- దొరశ్రీ
- చక్రవర్తి
- నాగిశెట్టి
- ఎస్.వి.రమణ
- ప్రసాద్ కాజ
- శ్రీ
- శ్రీను
- వనజశ్రీ
- క్రిప్
- ఎమ్.రాము
- భగవాన్
- ఎమ్.రాము
- సునీల్
- బాలకృష్ణ
- పద్మ
- శ్రీకర్
- పెండేల
- డి.శంకర్
- పుష్ప
- ఎన్.ఎస్.రావు
- నూతి
- టి.భాస్కర్
- ప్రసిద్ధ
- ఉలి
- జెన్నా
- కన్నాజిరావు
- శేఖర్
- సీతారామ్
- రవిశర్మ
- శ్రీధర్


హాస్యానందం SELFIE STORIES
YouTube Channel

**కార్టూనిస్ట్ మిత్రులకి హాస్యానందం YouTube లో మీ స్వపరిచయ వీడియోలకు ఆహ్వానం**

హాస్యానందం మన కార్టూనిస్టుల్ని ఉన్నత శిఖరాలపై చూపాలన్న ఆకాంక్షతో ఎప్పటికప్పుడూ కొత్త కొత్త వేదికల్ని ఏర్పాటు చేస్తోంది. ఇప్పుడు యూట్యూబ్‌లో మన కార్టూనిస్టుల స్వగతాలు ప్రపంచ ప్రజలకు చెప్పాలనేదే ఈ కొత్త ప్రయోగం! ఏం చేయాలి?ఎలా చేయాలి?...

వివరాల కోసం


www.hasyanandam.com

లాగిన్ అవండి!




✦ **శివలెంక చంద్రశేఖర్, హైదరాబాద్**

సెప్టెంబర్ హాస్యానందం పత్రిక నన్నెంతగానో ఆకట్టుకుంది. మనిషికి ఆకలి లేకపోతే కార్టూన్స్ అన్నీ బావున్నాయి. కథలన్నీ బావున్నాయి. ముఖ్యంగా 'పార్టీ చేసుకుందాం' కథ జడిపించింది. కార్టూనిస్టులను ప్రోత్సాహిస్తున్న, రాముగారికి, స్పాన్సర్లకి అభినందనలు. ఇది ఇలాగే కొనసాగాలి.



✦ **గీతారాణి చిలుకూరి,చెన్నై**

మనిషికి ఆకలి లేకపోతే కార్టూన్స్ అన్నీ బావున్నాయి. 'మొదటిదీ' కథ ఆకలి లేకపోవడానికి గల ఒక కారణం రచయిత చక్కగా చెప్పారు. సస్పెన్స్ మెయింటెన్ చేసిన విధానం బావుంది. ఇక ఈ సంచికలో ప్రచురించిన బుజ్జాయిగారి గురించిన వ్యాసం చాలా చక్కగా ఉంది. ఆయన గొప్పతనాన్ని ఆవిష్కరించందీ వ్యాసం. మామూలుగానే అదిరిపోయే కామెడీ క్రియేట్ చేస్తున్న 'గుండు'గారి హాస్యం... ఈ సంచికలో సెటైర్లతో కూడిన హాస్యంతో మరింత మెప్పించారు. హాస్యానందం మా నవ్వులకు చిరునామా!

✦ **ఆర్. శ్రీవత్సవ, బెంగళూరు.**

హాస్యానందం సెప్టెంబర్ సంచిక ముఖచిత్రం వినాయకుడు చాలా బాగుంది. ఎప్పుడూ చూడని భంగిమతో వెలువడిన ఈ చిత్రం ఆకర్షణీయంగా ఉంది. బుజ్జాయిగారి ప్రత్యేకమయిన వ్యాసం చాలా బాగుంది. ఆయన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి తనయులు అని ఈ పత్రికలో చదివి నంతవరకు మాకు తెలియదు. ఆయన ఎదిగిన తీరు కళాకారులకు స్ఫూర్తిదాయకం. ఇంత మంచి వ్యాసం రాసిన బ్నింగారిని అభినందించ కుండా ఉండలేం! అలాగే శ్రీ పూర్ణచంద్రరావుగారికి కూడా మా అభి నందనలు. హాస్యానందం ఎప్పటికప్పుడు మా అభిమానాన్ని సంపా దించుకుంటున్న తీరు ప్రశంసనీయం.

✦ **కె.వి.శ్రీలక్ష్మి, హైదరాబాద్**

హాస్యానందం సెప్టెంబర్ సంచికలో 'హాయ్ సానందంగా'లో ఎడిటర్గారు చెప్పినట్లు ' మన అనుభూతులు ఎదుటి వాళ్ళు ఎందుకు ఆస్వాదిస్తారు?' అన్న మాట గొప్ప మాట! ఎందుకంటే... ఎవరికి వారు, వాళ్ళకంటూ ఒక మంచి అనుభూతిని ఎంజాయ్ చేయలేని ఈ రోజుల్లో ఇంక ఎదుటివాళ్ళ అనుభూతులకు గౌరవమేమిస్తారు చెప్పండి? 'వాట్సాప్‌ల్లో ఏది పడితే అది పంపి, చులకన కాకుండా... మన సమయం, ఎదుటివాళ్ళ సమయం కాపాడదాం!'... అందరం పాటించి తీరవలసిన మాట ఇది. ఇక ఈ సంచికలో ప్రచురించిన బుజ్జాయిగారి వ్యాసం బావుంది. మనదేశంలోనే మొదటి కామిక్ చిత్ర కారులు అని తెలిసి ఆశ్చర్యంతో పాటు ఆనందించాను కూడా!

✦ **టి.విజయభాస్కర్, తణుకు**

హాస్యానందం సెప్టెంబర్ సంచికలో ప్రచురించిన కథలు బావు న్నాయి. 'మనిషికి ఆకలి లేకపోతే' సబ్జెక్ట్ మీద వేసిన కార్టూన్లు అన్నీ బావుండీ, నవ్వించడంలో సఫలీకృతమయ్యాయి. కార్టూనిస్టుల మెదడుకు పని పెడుతున్న హాస్యానందం మరిన్ని మంచి మంచి ఐడియాలతో మన కార్టూన్లు వెలువరించాలని కోరుకుంటున్నాను. అలాగే 'మాటల్లేవ్' శీర్షికన ప్రచురిస్తున్న క్యాప్షన్‌లెస్ కార్టూన్లు మన కార్టూనిస్టుల ఆలోచనా విధానాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తున్న హాస్యానందానికి జయహో!




## స్టాండప్ కామెడీ పోటీలో డాక్టర్ వి.వి.రామకుమార్ గారికి మొదటి బహుమతి

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ శాఖవారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు జరిగాయి.

డాక్టర్లకు జరిగిన ఈ పోటీలు సంగీతం, కవితలు, స్టాండప్ కామెడీ విభాగాల్లో జరిగాయి.

స్టాండప్ కామెడీ పోటీలో గుంటూరుకు చెందిన డయాబెటిక్ డాక్టర్ వి.వి. రామకుమార్ గారికి ప్రథమ బహుమతి లభించింది.



డాక్టర్ వి.వి.రామకుమార్ గారు గత 6 సంవత్సరాలుగా 'డాక్టర్స్ స్మైల్ క్లబ్' నిర్వహిస్తూ అనేక హాస్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


హాస్యానందంతో కలసి గత మూడేళ్ళనుంచి 'చక్కెరకేళి' అనే అంశంతో డయాబెటిక్ గురించిన అవగాహన కోసం కార్టూన్ పోటీలు, కథల పోటీలు, పేరడీ పాటల పోటీలు నిర్వహిస్తున్నారు.

అంతే కాకుండా వీరు 'లాఫ్టర్ యోగ'లో ట్రైనింగ్ పొందారు.


ఈయన డయాబెటిస్ గురించి, లాఫ్టర్ యోగ గురించి అనేక సభలలో మాట్లాడారు. నవ్వడం దాని వలన ఉపయోగాల గురించి ప్రజలలో అవగాహన పెంచి, నవ్వడం వలన వచ్చే ఉపయోగాలు ప్రజలకు అందేలా చూస్తున్నారు.

ప్రథమ బహుమతి పొందిన డాక్టర్ వి.వి.రామకుమార్‌గారికి అభినందనలు తెలుపుతూ... ముమ్ముందు కూడా ఇలా హాస్యానికి వెన్ను దన్ను కావాలని హాస్యానందం కోరుకుంటోంది.

## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు




మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **కార్టూన్ ఇష్టులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.






మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రముఖ కార్టూనిస్టులు శ్రీ ఏవీఎమ్ గారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.








కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన **శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం** కార్టూన్ కళని ఆరాధిస్తున్న కార్టూనిస్ట్‌లకు **వాగ్దేవి పురస్కారం-** ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి **1000 రూపాయలు&** **ప్రశంసాపత్రం** **శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు** అందజేస్తున్నారు.

ఈ నెల పురస్కార గ్రహీత **-నాగిశెట్టి**








కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
**(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)**
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం కార్టూనిస్ట్లను ప్రోత్సాహించాలని హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి **ప్రతినెలా 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**






కార్టూనిస్టులపై ప్రేమతో, వాత్సల్యంతో **శ్రీకుప్పచ్చి సుందరేశయ్య, శ్రీమతి సత్యవతి (కోవూరు) వార్లు** కార్టూనిస్ట్లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి **ప్రతినెలా 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**




ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ నాగ్రాజ్ గారు,
తమ తండ్రిగారు **శ్రీవాసం గంగాధర్ గారి** స్మారకార్థం
సోదర కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు వచ్చే సంచికలో




# 'పన్'చదార చిలుకలు


'హాస్యబ్రహ్మ' డా॥ శంకరనారాయణ




'వెస్ట్' కోట్ ఎండాకాలంలో 'వేస్ట్' కోట్!

శీర్షాసనం వేసినవాడు... 'తలెత్తుకు' తిరగలేదు!





'కంటి'కి నచ్చితే... 'కంటి'న్యూ!



కలెక్షన్ సూక్తి– ధనమేరా అన్నిటికీ మూలం...
ఎలక్షన్ సూక్తి– జనమేరా అన్నిటికీ మూలం!




గేట్ దగ్గర ఉన్నవాడే గ్రేట్! సర్వరక్షకుడూ అతడేగా!

ఎవరికోసం ఈ 'మందు'హాసం అని పాడుతారు తాగుబోతులు.






భోజనప్రియులు 'విందుమాగధులు'.




అవినీతి నాయకులు 'దొర'చేపలు.



మొగుడు చెప్పిందే 'శీల' శాసనం.



తాళి 'ఎగతాళి'లో ఎంచక్కా ఒదిగిపోయిందో!




రావణుడు అదృష్టవంతుడు. 9 తలలు తాకట్టు పెట్టినా ఇబ్బంది లేదు.



పశువు గడ్డి తింటుంది... మనిషి నానా గడ్డి తింటాడు... ఇదే పశువుకు మనిషికి తేడా!!



కిళ్లీకొట్టువాడిదీ 'పాన్'డిత్యమే

*Cartoons: Ramseshu*

హాస్యానందం సౌజన్యంతో

ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం (14,నవంబర్) సందర్భంగా

## రామ్‌కుమార్స్ డయాబెటిస్ అకాడమీ & డాక్టర్స్ స్మైల్ క్లబ్, గుంటూరు వారు నిర్వహిస్తున్న

## కార్టూన్లు, మినీ హాస్య కవితల పోటీలు

# చక్కెర 'కేళి'

**కార్టూన్ బహుమతులు**

రూ.500/-లు చొప్పున
10 కార్టూన్‌లకు బహుమతులు
&
ప్రశంసాపత్రం

**మినీ హాస్య కవితల బహుమతులు**

రూ.500/-లు చొప్పున
10 కవితలకు బహుమతులు
&
ప్రశంసాపత్రం

*నిబంధనలు:*

- *అంశం- షుగర్ వ్యాధి గురించే అయ్యుండాలి!*
- షుగర్ వ్యాధి రాకుండా జాగ్రత్తలు, వచ్చిన తరువాత జాగ్రత్తలు సూచిస్తూ కవితలు, కార్టూన్లు పంపించండి.
- పేషేంట్లను కించపరిచేటట్లు, భయపెట్టేటట్లు కవితలు, కార్టూన్లు ఉండకూడదు.
- ఆరోగ్యంగా ఉండేందుకు అవగాహన పరిచేటట్లు కవితలు, కార్టూన్లు ఉండాలి.
- మాకు వచ్చిన అన్ని కార్టూన్లు, కవితలతో సావనీర్ ప్రచురించి, అందజేస్తాం!
- కవితలు 20 లైన్లకు మించి ఉండరాదు. కార్టూన్లు 300 లో స్కాన్ చేసి ఈమెయిల్‌కు పంపండి. **hasyanandampoteelu@gmail.com**

*With best compliments from*
Dr.V.V.Rama Kumar,
S.V.R. Diabetes Care & Research Centre
Kothapeta, Guntur-522 001

**కార్టూన్లు, కవితలు చేరవలసిన ఆఖరి తేదీ నవంబర్-14,2021**

ప్రియమైన పాఠకులకు,



నా సాదర నమస్సులు. హాస్యం ఒక అద్భుతమైన కళ. అందరికీ అలవడే గుణం కాదు. ఇతర రచనలతో పోలిస్తే, హాస్య రచన చేయడం ఇంకా కష్టం.

మా నాన్నగారికి హాస్య రచనలు అంటే ఎంతో మక్కువ. తెనాలి రామలింగడి కథల నుండి బారిష్టరు పార్వతీశం నవల వరకు అనేక రచనలు చదివి, చిన్నప్పుడు మా వద్ద విశ్లేషించేవారు. దూరదర్శన్‌లో భమిడిపాటి రామగోపాలం కథలు ప్రసారమయ్యే రోజులలో, ఆ కథలు రాసిన రచయితను గొప్ప మేధావిగా మా వద్ద పేర్కొనేవారు. హాస్యం ఎక్కడో పుట్టదు.మన జీవితాల నుండే పుడుతుందని అనేవారు.

హాస్యం అనేది ఒక టెక్నిక్. హాస్యం అనేది ఒక ఔషధం. హాస్యం ఉల్లాసాన్ని పంచే ఒక వాహకం. హాస్యం ఒక ఆటవిడుపు. హాస్య చతురత లేని వ్యక్తులతో మనం త్వరగా ఇమడలేం.

ఈ ప్రపంచంలో హాస్యానికి అంటూ ఒక ప్రత్యేకత ఉంది.

అందుకే, మా నాన్న గారి జ్ఞాపకార్థం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా హాస్య కథల పోటీ ఒకటి నిర్వహించాలనే ఆలోచన  వచ్చింది.

ఈ ఆలోచనను మిత్రుడు, కార్టూనిస్టు నల్లపాటి సురేంద్రతో ఓసారి పంచుకుంటే, ఆయన హాస్యానందం పత్రిక యాజమాన్యం, ప్రతీ నెల నిర్వహించే పోటీల గురించి తెలిపారు. ఈ క్రమంలో ఈ పత్రిక సౌజన్యంతోనే మా నాన్న గారి పేరిట కూడా ఓ కథల పోటీ నిర్వహించాలని భావించాను. ఆ ఆలోచన కార్యరూపం దాల్చాక, మీ ముందుకు వచ్చిందే **'స్వర్గీయ శ్రీ కొయిలాడ వెంకునాయుడు స్మారక హాస్య కథల పోటీ'**. ఈ పోటీకి గాను **'ప్రవాసాంధ్రులు'** అనే అంశాన్ని ఎంపిక చేయడానికి కూడా ఓ కారణం ఉంది.

మా నాన్నగారు బర్మాలో పుట్టి పెరిగారు. అలాగే రూర్కెలా, చెన్నై లాంటి ఇతర ప్రాంతాలలో కూడా ఉద్యోగ రీత్యా పని చేశారు. నేను కూడా హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగుళూరు, ఢిల్లీ, నోయిడా లాంటి ప్రాంతాలలో పనిచేశాను. ఈ క్రమంలో అనేకసార్లు ప్రవాస జీవితం మనకు ఎలాంటి పాఠాలు నేర్పిస్తుందో ఒకరితో ఒకరం చెప్పుకొనేవాళ్లం.

"Act like a Roman, when you are in Rome" అనే ఓ నానుడి ఉంది.

మనది కాని దేశం లేదా రాష్ట్రంలో ఆయా ప్రాంతాల సంప్రదాయాలకు అనుగుణంగా మనల్ని మనం మార్చుకోవడంలో, వారితో కలిసిపోవడంలో చాలా  ఆసక్తికరమైన విషయాలు దాగి ఉన్నాయి. అయితే ఈ క్రమంలో మన ఉనికిని, అస్తిత్వాన్ని కోల్పోతున్నామా? అన్నది ఓ ప్రశ్న.

చెన్నైలో తెలుగు వచ్చినా రాన్నట్లు నటిస్తూ... కేవలం తమిళంలో మాత్రమే మాట్లాడే తెలుగు వారిని చాలామందిని చూశాను. ఢిల్లీలో హైదరాబాద్ బిర్యానీ దొరక్క, మురదాబాదీ బిర్యానీకి అలవాటు పడిన తెలుగువాళ్లనీ చూశాను. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో...  అలాగే మా  బంధువుల పిల్లలు చాలామంది సింగపూర్, అమెరికా, దుబాయ్ లాంటి ప్రాంతాలలో సెటిల్ అయ్యారు. కొందరు ఐటిఐ లాంటి కోర్సులు చేసి అడపా, దడపా విదేశాలకు వెళ్లి వస్తుంటారు. వారు కూడా అప్పుడప్పుడు తమ అనుభవాలను నాతో పంచుకున్న సందర్భాలు ఉన్నాయి. అందులో చాలా విచిత్రమైనవి కూడా ఉన్నాయి. ప్రవాస జీవితంలో భాష, ఆహారం, వస్త్రధారణ, అలవాట్లు... వీటితో వచ్చే చిక్కులు అన్నీ ఇన్నీ కావు. అప్పుడప్పుడు అవి గమ్మత్తుగా కూడా ఉంటాయి.

ఏదేమైనా, 'ప్రవాసాంధ్రులు' అనే అంశంపై నిర్వహించిన హాస్య కథల పోటీ మంచి రెస్పాన్స్ రావడం, నాకు ఆనందంగానే ఉంది. అందరూ వైవిధ్యమైన అంశాలనే ఎంచుకున్నారు. కొందరు తమ అనుభవాలను కూడా కథలుగా రాసి పంపారు. అయితే ఇది మినీ కథల పోటీ కాబట్టి, కొన్ని పరిమితులకు లోబడి.. రచనలను వివిధ కోణాలలో పరిశీలించి  ఫలితాలను ప్రకటించడం జరిగింది.

మరోమారు నాకు ఈ పోటీని నిర్వహించే అవకాశం కల్పించిన హాస్యానందం సంపాదకులు శ్రీ రాము గారికి నా వేవేల ధన్యవాదాలు.

మీ భవదీయుడు

**కొయిలాడ బాబు (సీనియర్ ఎగ్జిక్యూటివ్, డిస్నీ హాట్‌స్టార్)**



శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
**మొదటి బహుమతి పొందిన కథ**

# అమెరికల

నెల్లుట్ల రమాదేవి,
9440622781

**"ఇక్కడో మంచి అమ్మాయి ఉంది. నువ్వొచ్చి ఓసారి చూసి నచ్చితే మాట్లాడుదాం!" అంటూ లక్ష్మి పిన్ని ఫోన్చేసినప్పటినుండి శ్రీకర్‌కి కాలాగలేదు. ఫేవరేట్ హీరో కొత్త సినిమా రిలీజ్ అవుతుంటే సంబరపడిపోయే అభిమానిలా ఆత్రపడసాగాడు.**

**"ఆ విలేజ్ గర్ల్ నన్ను చేసుకుని యూఎస్ వచ్చి అడ్జస్ట్ అవుతుందంటావా?" అనే సందేహం కూడా వెలిబుచ్చాడు.**

**"నువ్వొచ్చి చూసాక ఆ మాట చెప్పు!" అంది లక్ష్మి పిన్ని.**

**రెక్కలు కట్టుకొని కాకపోయినా వెంటనే వాలిపోయాడు.**

"మీ ఇల్లు బావుంది... అమెరికాలో ఇళ్ళలా! అక్కడ ఇళ్ళు చాలా నీట్ గా ఉంటాయి పిన్నీ! రోడ్స్ భలే ఉంటాయి తెల్సా? మిల్క్ పారబోసి మళ్ళీ గిన్నెలో ఎత్తుకోవచ్చు!" అన్నాడు శ్రీకర్.

"ఎందుకూ అలా ఊరికే పారబోయడం... మళ్ళీ ఎత్తుకోవడం?" అంది లక్ష్మి కాఫీ అందించి నవ్వుతూ.

"యూఎస్‌లో స్టార్‌బక్స్ కాఫీ తాగాక ఇంకెక్కడా తాగబుద్దేయడం లేదు పిన్నీ!" అన్నాడు.

"ఓసారి తాగి చూడు! నచ్చకపోతే వదిలెయ్!" అంది లక్ష్మి.


"వావ్!... ఇంత బావుంటుందనుకోలేదు!" అన్నాడు గ్లాస్‌లో చుక్క వదలకుండా తాగి.


"ఈ ఊర్లో అమ్మాయి ఎవరు పిన్నీ?... బావుంటుందా?...యూఎస్ లైఫ్‌కి అడ్జస్ట్ కావడం కష్టం. నీ మాటకాదనలేక వచ్చా! కానీ ఇదేదో కుదురుతుందని నాకేం నమ్మకం లేదనుకో!... అసలు చాలామంది ట్రైచేస్తున్నారు. బట్... ఒక్కటీ సెట్ కావట్లేదు."

"ఓఁ!... దిబ్బ రొట్టె చేశావా? చీస్ విత్ పాస్తా అనుకున్నా!"

" అప్పడాలూ, వడియాలూనా?... వదిలేసి చాలా కాలమైంది. టోటల్‌గా ఆయిల్‌లో దూకినట్లే ఉంటాయి. యూ నో...యూఎస్‌లో ఇవన్నీ కుదరవు."

అలా ప్రతి దానికీ అమెరికా మాటెత్తకుండా ఉండలేని శ్రీకర్‌ను ఆశ్చర్యంగా గమనించ సాగింది లక్ష్మి. అతనిధోరణీ, ఆర్భాటం గురించి దగ్గరి బంధువులు వేస్తున్న జోకులు తెలిసాయి గానీ, అక్క కొడుకూ.. మొదట్నుంచీ మంచి కుర్రాడు...పైగా ఓ మంచి అమ్మాయిని చూడమని అక్క స్వయంగా చెప్పడంతో తన ఆడ







బిడ్డకూతురితో సెటిల్ చేద్దామని అనుకుంది. చూడబోతే ఇండియాలో పుట్టి పెరగనట్టూ, ఆకాశంలోంచి ఊడిపడ్డట్టూ చేస్తున్నాడు.

శ్రీకర్ తల్లిదండ్రులు పెద్దగా ఉన్నవాళ్ళేం కారు. కష్టపడి కూతురు పెళ్లి చేశారు. అల్లుడు గవర్నమెంట్ టీచర్. వాళ్ళ బంధువుల్లో చాలా మంది ఏదో రకంగా కొడుకుల్ని అమెరికా పంపడం, కాస్త సెటిల్ అయ్యాక వీళ్లూ ఓసారి అమెరికా వెళ్లొచ్చి అక్కడ అలా ఉంటుందీ, ఇలా ఉంటుందీ అంటూ గొప్పలు చెప్పుకోవడం, మావాడు ఇల్లు కొన్నాడు... కారు కొన్నాడు, పెద్ద టీవీ కొన్నాడు... భూమి కొన్నాడు... ఫామ్‌హౌస్ కట్టాడు... అంటూ ఊదర గొట్టడం చూసీ, చూసీ... ఎలాగైనా సరే శ్రీకర్‌ను అమెరికా పంపడమే తమ జీవితాశయంలా భావించారు.

అందుకే అయిదుసార్లు వీసా రిజెక్టయినా శ్రీకర్ తండ్రి పట్టు వదలని పాపారావు, బంధుమిత్రుల్లో పరువూ, ప్రతిష్ఠా మన్నూ మశానం దెబ్బతింటున్నాయని అమెరికా వెళ్ళే దాకా శ్రీకర్ గుండెల్లో నిద్రపోయాడు.

ఎట్టకేలకు ఏదో యూనివర్సిటీలో ఎమ్మెస్ చేసి, కిందా మీదా పడి హెచ్ వన్ వీసా సంపాదించి గ్రీన్‌కార్డు వచ్చేదాకా ఇండియాకు రాలేదు శ్రీకర్.

ఇన్నాళ్లకు వచ్చాడు... ఇక పెళ్లి చేసి పంపిద్దామని తల్లిదండ్రులు చూస్తున్నారు... బాగా ఆస్తిపాస్తులూ, డబ్బూ కలిగిన కుటుంబం లోంచి వచ్చి అమెరికాలో ఉద్యోగం చేస్తున్న అందమైన అమ్మాయిని పెళ్లాడితే బావుంటుందని కుటుంబంలోని అందరి కోరిక. ఆ క్రమంలో అందరికీ కొడుకు గురించి లేని గొప్పలు చెప్పడం మొదలెట్టారు. తన గురించి తనకు నిజం తెలియక అతిగా ఊహించుకుని ఫీలయ్యే వారసత్వపు హీరోలా అయ్యాడు శ్రీకర్.




ఈ తొమ్మిదేళ్లలో భారతదేశంలోనూ... అమ్మాయిల్లోనూ వచ్చిన మార్పులు ఏ మాత్రం తెలియవతనికి.

ఇంతలో లక్ష్మి భర్త రమేష్ పొలం నుండి వచ్చాడు.

కుశల ప్రశ్నలు అయ్యాక... "ఎన్నాళ్ళు చేస్తారు బాబాయ్! ఈ వ్యవసాయం? డామ్ బోర్!... ఏదైనా కొత్త బిజినెస్ ట్రైచేయక పోయారా?" అన్నాడు శ్రీకర్.

'బాగా ముదిరిందే!...' అన్నట్టు చూసాడు రమేష్ లక్ష్మి వైపు.

లక్ష్మి ఫొటోల్లో లక్ష్మీదేవిలా మళ్ళీ చిరునవ్వు నవ్వింది.

"యూ నో! యూఎస్‌లో అగ్రికల్చర్ తీరే వేరు. ఎంత బాగా చేస్తారో తెల్సా?" అన్నాడు శ్రీకర్ తన ధోరణిలో.

"తెల్సు!... అక్కడ పెద్ద పెద్ద కమతాలుంటాయి. రైతులు పొలాల్లోనే ఇళ్ళు కట్టుకుని ఉంటారు... వ్యవసాయదారులందరికీ కార్లు ఉంటాయి. అన్ని పనులకూ యంత్రాల్నే వాడతారు. లాభాలు కూడాఎక్కువే!" అన్నాడు రమేష్ పాడీ పంటా కార్యక్రమ వ్యాఖ్యాతలా.

"మీకెలా తెల్సు?... ఓఁ! టీవీల్లో చూసి ఉంటారు కదా!" మళ్ళీ ఒక ప్రశ్న వేశాడు.

"వెర్రివాడా!..." అంటూ సద్గురువు తన శిష్యుని వంక చూసినట్టు చూసి– "నేను అక్కడికి వెళ్ళినప్పుడు చూసాను!" అంటూ లేచి బయటికి వెళ్ళాడు రమేష్.

"మీ బాబాయ్‌కి నాలుగుసార్లు ఆదర్శ రైతు అవార్డ్స్ వచ్చాయి... మన ప్రభుత్వం వాళ్ళు

పంపిస్తే ఓసారి అమెరికాకి... ఇంకోసారి యూరప్‌లో కొన్ని దేశాలకి వెళ్లొచ్చారు కూడా!" అని చెప్పింది లక్ష్మి.

ఎక్కువ సేపు నోరు తెరిస్తే నోట్లో ఏవైనా దూరుతాయని మూసుకున్నాడు శ్రీకర్.

✦ ✦ ✦

ఆ సాయంత్రం శ్రీకర్‌ని వెంటపెట్టుకుని ఆడబిడ్డ ఇంటికి వెళ్ళింది లక్ష్మి.

వాళ్ళు ఎంతో ప్రేమగా ఆహ్వానించారు.

ఎక్కువ హడావుడీ, ప్రత్యేకతా ఆశించిన శ్రీకర్ ... వాళ్ళు చాలా సహజంగాఉండడంతో తనసలు అమ్మాయిని చూడ్డానికి వస్తున్నట్టు పిన్ని చెప్పిందో లేదోనని అనుమానపడ్డాడు.

మొదట్లోనే ఎదురుపడిన ఓ ముసలాయన "నీ పేరేంటబ్బాయ్ ?" అనడిగాడు.

శ్రీకర్ వీలయినంత స్టైల్‌గా చెప్పాడు.

"హేవిటీ!... స్పీకరా!... హదేం పేరు?" అన్నాడాయన. లక్ష్మి సర్ది చెప్పాక...

"మరి హలా చెవుతాడేం?" అన్నాడాయన.

శ్రీకర్ ఉత్సాహం మీద ఓ డ్రమ్ము నీళ్లు చల్లినట్లయింది .

లక్ష్మి ఆడపడుచు మణి అతిథి మర్యాదలు చేసింది. శ్రీకర్ చిన్నప్పుడు వాళ్ళమ్మ చేస్తే ఇష్టంగా తినే పిండివంటలు ఓ అరడజను రకాలు పెట్టారు.

"ఇవన్నీ ఇంకా తింటున్నారా?... ఐ మీన్ ఈ పాత కాలం వంటలు?" అన్నాడు శ్రీకర్.

"భలేవాడివి బాబూ! మా పిల్లలందరూ ఇష్టంగా తింటారు. నేను వీళ్ళ కోసం అమెరికాకు కూడా పంపిస్తూంటాను." అంది మణి.




ఇంతలో ఇద్దరు యువకులు వచ్చి కూర్చున్నారు. అందులో ఒకతను– "బాగున్నారా అత్తయ్యా !" అంటూ లక్ష్మిని పలకరించాడు.

"మా పెద్దబ్బాయి వివేక్. షికాగోలో డాక్టర్. కోడలు కూడా డాక్టరే. ఇండియాకు వచ్చింది గానీ వాళ్ళమ్మావాళ్ళింటికి వెళ్ళింది. రేపు ఇక్కడికి వస్తుంది. వీడు మా చిన్నబ్బాయి విక్రమ్, యూఎస్‌లోనే నాసాలో సైంటిస్ట్. ఇంకా పెళ్లి కాలేదు." పరిచయం చేసింది మణి.

వాళ్లిద్దరూ పలకరింపుగా నవ్వారు.

శ్రీకర్ కళ్ళముందు సినిమాల్లోలా నల్లటి వలయాలు తిరుగుతున్నాయి.

"మృదులా! ఏం చేస్తున్నావ్?" ఆమే పిలవగానే– "వస్తున్నానమ్మా!" అంటూ వచ్చింది అందంగా, నాజూగ్గా ఉన్న ఓ అమ్మాయి.

వాళ్ళమ్మ పక్కన కూర్చుంది మృదుల.

"మా అమ్మాయి మృదుల... తను ఇక్కడ ఐ.ఐ.టి, ఖరగపూర్‌లో చదివి, యూఎస్‌లోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. కానీ... ఇక్కడ సెటిల్ అవడమే ఇష్టం!" పరిచయం, ఉద్దేశం రెండూ చెప్పింది మణి.

శ్రీకర్‌కు కళ్ళు తప్ప చెవులు విన్పించడం మానేశాయి.

"బాగున్నావా లక్ష్మమ్మా! ఈ బాబెవరూ?" అంటూ కాఫీలు పట్టుకొచ్చిన ఇంకో ఆడపడుచు నిర్మల అడిగింది.

"మా అక్కయ్య కొడుకు!" అంటూ శ్రీకర్‌ని పరిచయం చేసింది లక్ష్మి.

"ఈ బాబునెక్కడో చూసినట్టుందే... ఆ... ఆ... గుర్తొచ్చింది. పది రోజుల క్రిందట నేనొచ్చిన విమానంలోనే వచ్చాడు. కదూ బాబూ!" అనడిగింది నిర్మల.

తను కూర్చున్న సీట్‌కి పక్కన కూర్చున్న వ్యక్తిగా ఆమెను గుర్తించాడు శ్రీకర్.

"ఓ, మీరంతా పెద్ద గ్రూప్ గా ఉన్నట్లున్నారు కదా! గుర్తుపట్టలేదు." అన్నాడు శ్రీకర్ చిన్నగా, మళ్ళీ ఏం బాంబ్పేలుతుందోనన్నట్లు.


"మా నిర్మల వంటలు బాగా చేస్తుంది. వీళ్లకు మంచి టీం ఉంది . అమెరికాలో మన తెలుగు సంఘాల వాళ్ళపెద్ద పెద్ద మీటింగులప్పుడు సంప్రదాయ వంటలకు వీళ్ళని పిలుస్తారు. పదేళ్ల వీసా ఉంది తనకి. ఇప్పటికి ఎనిమిదిసార్లు వెళ్ళొచ్చింది." అంటూనే...

"అదేంటి బాబూ!... ఏమీ తిన్లేదు? అన్నీ అలాగే వదిలేశావు?" అడిగింది మణి.

'ఖంగు తిన్నాడు కదా! ఇంకేం తింటాడు?!' అనుకుంది లక్ష్మి.



సీరియల్



# లక్కీఖేలో

జి. రవికిరణ్

**రాజేష్ దగ్గరికి వెళ్లింది స్వాతి.**

**"సార్. ఇది ఏదో కొరియర్ స్లిప్. వీళ్ళకు టెన్ డేస్ బ్యాక్ కొరియర్ వచ్చినట్లుంది. చూడండి."అని ఇచ్చింది.**

**రాజేష్ వెంటనే కానిస్టేబుల్‌కిచ్చి ఎంక్వయిరీ చేయమన్నారు.**

**ఇంకా ఏమీ దొరకలేదు. అందరూ వెనక్కి వచ్చేసారు.**

✦ ✦ ✦

ఢిల్లీ నుంచి ప్రసాద్ ఫ్రెండ్ శ్రీకాంత్ వచ్చాడు.

సర్వర్ డీటెయిల్స్ అన్నీ ఇచ్చాడు కిషోర్. అన్నీ చెక్ చేసాడు.

"ఈ సర్వర్‌తో లక్షల ఈమెయిల్స్ పని చేస్తున్నాయి. ఈ లొకేషన్ నుంచి వెళ్లినవి ప్రాజెక్ట్‌కి సంబంధించినవే ఉన్నాయి. నీ పేరు మీద చేసినవి కొన్ని ఉన్నాయి. కాని వాళ్ళు ఆపరేట్ చేసినవి సార్టవుట్ చేయాలంటే. ఇంకా డీటెయిల్స్ ఏమైనా కావాలి." అన్నాడు శ్రీకాంత్.

"సార్ వాళ్లిద్దరూ ఉంది హైదరాబాద్‌లోనే కాబట్టి. హైదరాబాద్‌లోని అదర్ లొకేషన్స్ నుంచి వెళ్ళిన ఈమెయిల్స్ చూడండి." అన్నాడు కిషోర్.

లొకేషన్ వైజ్ డేటా తీసాడు శ్రీకాంత్.

"హైదరాబాద్‌లో వాళ్ళవి ఏవే ఉంటాయి. ఇవి థౌజెండ్స్‌లో ఉంటాయి."

"సార్! చతుర్వేది, కోమలి, ముస్తాక్, ముంతాజ్. ఈ పేర్లలోని లెటర్స్‌తో ఏవైనా ఐడీలు ఉన్నాయేమో చెక్ చేయండి సార్." అంది స్వాతి.

శ్రీకాంత్ దాదాపు రెండు గంటలు కుస్తీ పట్టాడు. పది ఈ మెయిల్స్ ట్రేస్ అవుట్ చేసారు. చతుర్‌ముస్తాక్ పేరుతో ఉన్నాయవి. వాటికి ఉన్న అటాచ్డ్ ఫైల్స్ డౌన్‌లోడ్ చేసారు. వెంటనే రాజేష్‌కి ఫోన్ చేసారు.

కాసేపటికే రాజేష్ వచ్చి, ఆ ఫైల్స్ ఓపెన్ చేయించి డేటా తీయించాడు.

"ఓ మైగాడ్. ఇనార్బిట్‌లో బ్లాస్టింగ్స్‌కి వాళ్ళు ప్లాన్ చేసారు. ఆ ఆపరేషన్ మీదే వాళ్లిద్దరు వచ్చారు." అన్నాడు రాజేష్.

"కాని వాళ్ళు ఎప్పుడు చేయాలని ప్లాన్ చేసారు. అది ఉందా?" అడిగాడు కిషోర్.

"నో! ఈ డేటా కొద్దిగా డీకోడ్ చేస్తే గాని తెలియదు!" అన్నాడు రాజేష్.

ఇంతలో కొరియర్ తాలూకూ డీటెయిల్స్‌తో కానిస్టేబుల్ వచ్చాడు.

"సార్! ఈ కొరియర్ పూనే నుంచి వచ్చింది సార్. అందులో అయితే ఒన్ కేజీ అనే నోట్ చేసారు. బుక్స్ అని రాసారంతే. డెలివరీ చేసిన కుర్రాడిని పట్టుకొచ్చా!" అంటూ ఆ కుర్రాడిని చూపించాడు.

"డెలివరీ చేసినప్పుడు ఆ ఇంట్లో ఎవరున్నారు?" అడిగాడు రాజేష్.

"ఇద్దరే సార్! భార్యాభర్తలనుకుంటా సార్. ఆ సార్ సైన్ చేయలేదు సార్. ఆ మేడమ్మే సైన్ చేసి తీసుకుంది సార్!" అన్నాడు కుర్రాడు.

"నువ్వెళ్ళినప్పుడు ఇంకెవరైనా ఉన్నారా?" అడిగాడు రాజేష్.

లేరన్నట్లు తలూపాడు కుర్రాడు.

**ఇంతకు ముందు...** మహేష్, కిషోర్ ఇద్దరు స్నేహితులు. ఒకే ఆఫీసు, ఒకే ఇల్లు. కానీ ఇద్దరి మనస్తత్వాలు వేరు వేరు. మహేష్ చాలా స్పీడు. కిషోర్ నెమ్మదస్తుడు, భయస్తుడు కూడా! ఆఫీసులో బాసు పి.ఎ. అంటే ఇష్టం కానీ చెప్ప లేదు. కలల్లో ఆమెతో విహరిస్తుండం, కబుర్లు చెప్పడం లాంటివి చేస్తుంటాడు. మహేష్ అలా కాదు. రోజుకో అమ్మాయితో షికార్లు, కాలక్షేపలు చేస్తుంటాడు. కిషోర్ ఒక కేసులో ఇరుక్కుంటాడు. అతన్ని రక్షించడానికి స్వాతి ప్రయత్నాలు చేస్తుండగా కొందరు స్వాతి వెంటపడతారు... **తర్వాత...**

“ఏమైనా చెప్పగలవా?”అడిగాడు కిషోర్.

“అందులో ఏవో పీసెస్ ఉన్నట్లుగా కదులుతున్న సౌండ్ వచ్చింది సార్”.

“కమాన్! అది బాంబ్ మెటీరియలే!” అన్నాడు రాజేష్.

“సార్… జనరల్‌గా వీళ్ళు ప్లానింగ్‌కి ఎన్ని రోజుల ముందు బాంబు రెడీ చేస్తారు. దానికి మెటీరియల్ వీళ్ళకు ఎన్నిరోజుల ముందు వస్తుంది.” అడిగాడు కిషోర్.

ఆలోచించాడు రాజేష్. ఎవరికో ఫోన్ చేసాడు. కాసేపు మాట్లాడాడు.

“వాళ్ళు మూడు రోజుల ముందు బాంబుని తయారుచేస్తారు. రెండు రోజుల ముందు లొకేషన్‌లో రెక్కీ చేస్తారు. ఒకరోజు ముందు సెట్ చేస్తారు. తర్వాత రోజు పేలుస్తారు.” అన్నాడు రాజేష్.

“మరి మెటీరియల్?” అడిగాడు కిషోర్.

“వన్ వీక్ బిఫోర్ మేకింగ్ అంటే వాళ్ళు తయారు చేయడానికి వారం ముందే వస్తుంది” అన్నాడు రాజేష్.

“వారం ముందు… మూడు రోజులు… అంటే లెక్క ప్రకారం వాళ్ళు ఈ రోజే బ్లాస్ట్ చేయాలి.” అన్నాడు కిషోర్.

అందరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

“ఓ మైగాడ్!” అన్నాడు మహేష్.

“వాళ్ళ మెయిల్ ఐడీస్ ఇప్పుడు ఇండియాలో ఎక్కడ ఆపరేట్ అవుతున్నాయో ట్రేస్ అవుట్ చేస్తే వాళ్ళ లొకేషన్ ఏమైనా దొరుకుతుందేమో! వాళ్ళు ఇక్కడే వుంటే ఈ రోజే ప్లాన్ చేసినట్లు కన్‌ఫామ్ చేసుకోవచ్చు!” అన్నాడు రాజేష్.

“ఎందుకంటే బ్లాస్టింగ్‌కి ముందు వాళ్ళు కచ్చితంగా కమ్యూనికేట్ చేసుకుంటారు.” అన్నాడు.

రాజేష్ వెంటనే ఫోన్ చేసి ‘ఇనార్బిట్ మాల్‌కు వెళ్ళి వెంటనే అలర్ట్ చేయండి. బాంబ్ స్క్వాడ్‌ను తీసుకెళ్ళి చెక్ చేయండి!” అని ఆర్డర్స్ ఇచ్చేసాడు.

శ్రీకాంత్‌ను మరోసారి చెక్ చేయమన్నాడు కిషోర్. అందరూ టెన్షన్‌గా చూస్తున్నారు.

“ఎస్… జస్ట్ నౌ ఇప్పుడే ఒక మెయిల్ కమ్యూనికేట్ చేసారు. కాని ఓన్లీ నెంబర్ పంపారు. 18-5-1-4-25 ఇదే ఉంది!” అన్నాడు శ్రీకాంత్.

“ఎక్కడనించి ఆపరేట్ చేసారు?” అడిగాడు రాజేష్ ఆత్రంగా.

“ఇట్స్ నియర్ టీసీఎస్, సైబరాబాద్!” అన్నాడు శ్రీకాంత్.

“అంటే ఇనార్బిట్ మాల్‌కి దగ్గరే!” అన్నాడు మహేష్.

“ఇంతకీ ఆ కోడ్ ఏంటి?” అన్నాడు కిషోర్.

“రెడీ” అంది స్వాతి.

అందరూ క్వశ్చన్‌మార్క్ ఫేస్ పెట్టారు.

“యెస్….ఆర్.ఈ.ఏ.డీ.వై రెడీ…ఇంగ్లీష్‌లో వాటి సీరియల్ 18,5,1,4,25” అంది.

“అంటే బ్లాస్టింగ్‌కు రెడీ” అన్నాడు రాజేష్.

అందరూ వెంటనే ఇనార్బిట్ మాల్‌కు వెళ్లారు.

✦ ✦ ✦

అక్కడికి వెళ్ళేసరికి ఇనార్బిట్ మాల్ చుట్టూ జనం ఉన్నారు. పోలీసులు వాళ్ళని దూరంగా తోసేస్తున్నారు.


రాజేష్ వెళుతూ “మీరిక్కడే వుండండి!” అన్నాడు.

“వాడు ఇక్కడే ఎక్కడో ఉండుంటాడు.” అన్నాడు కిషోర్ చుట్టూ చూస్తూ.

“వాడు బాంబ్ ఏ ప్లేస్‌లో పెట్టి ఉంటాడంటావు?” అన్నాడు మహేష్.

కిషోర్ సీరియస్‌గా చూడడంతో తల దించుకున్నాడు మహేష్.

స్వాతి మాత్రం అదే ఆలోచిస్తుంది.



"ఏ హ్యూమన్ బీయింగ్ అయినా వాడి అలవాట్లు, టేస్ట్ ఏ పనిలో అయినా వాడతాడు. అది మంచైనా, చెడైనా, గొప్పదైనా, దరిద్రపు దైనా!...ఆ చతుర్వేదిగాడి అలవాట్లు, బిహేవియర్ ఒక్కసారి మనం గుర్తు చేసుకుంటే ఏమైనా క్లూ దొరకొచ్చేమో" అంది స్వాతి.

ఒక్కసారి రీలు వెనక్కు తిప్పింది.

"చతుర్వేదిగాడి నవ్వు, చూపులు అన్నీ గుర్తు కొచ్చాయి. ఫుడ్ తినేటప్పుడు, క్యాంటీన్‌లో ఉన్నప్పుడు, రిసెప్షన్‌లో ఉన్నప్పుడు అవన్నీ గుర్తు తెచ్చుకుంటుంది. ఏమీ ఐడియా రావటం లేదు. సిస్టమ్ ఆపరేట్ చేసేటప్పుడు... ఎస్... వాడు కార్ రేస్ ఎప్పుడూ ఆడుతుండేవాడు.


"ఎస్! వాడు కార్ రేస్ బాగా ఆడేవాడు. మాల్‌లో గేమ్ జోన్‌లో అవి ఉంటాయి కదా. వాటిలోనే పెట్టుండొచ్చు!" అరిచింది స్వాతి.

అక్కడున్న పోలీసులకు చెప్పి కిషోర్... మహేష్ లోపలకు పరుగులు పెట్టారు. ఒక సిక్కులోడు స్వాతి వంక చూస్తూ నవ్వాడు.

స్వాతి టెన్షన్‌గా చూస్తూ అంది. ఆ నవ్వు ఎస్! వాడే ఆ నవ్వు వాడిదే. అయినా వాడిని గుర్తు పట్టనట్లే నటించింది. వాడు మాత్రం మాటిమాటికీ వాచీ చూసుకుంటున్నాడు... అంటే టైమ్ దగ్గర పడిందన్నమాట అనుకుంది స్వాతి.

"ప్లీజ్! ఐ హేవ్ టు గో ఇన్‌సైడ్!" అంది స్వాతి.

"నహీం! నహీం!!" అన్నాడు.




"ప్లీజ్ సాబ్! జానే దీజీయేనా" అంది స్వాతి.


వాడు గట్టిగా చేయి పట్టుకుని ఆపాడు.

"హౌ డేర్ యూ!" అంటూనే చెంప మీద కొడుతున్నట్లు చేయి ఎత్తి వాడి గడ్డం లాగేసింది స్వాతి.

అంతే వాడితోపాటు చుట్టూ వున్న పోలీసులు కూడా అవాక్కయ్యారు. వాడు తేరుకునే లోపే ఒక్క కిక్ ఇచ్చింది స్వాతి. అంతే వాడు కిందపడ్డాడు.

వాడిని పోలీసులు చుట్టుముట్టారు.

అక్కడ పరుగులు పెట్టి వెళ్లిన కిషోర్, మహేష్ రాజేష్‌ని కలిసి విషయం చెప్పారు. వెంటనే గేమ్‌జోన్‌లో ఉన్న మెషిన్లన్నీ వెతకడం మొదలెట్టారు.




చివరికి ఐదో మిషన్‌లో బాంబ్ డిటెక్ట్ అయింది. వెంటనే దాన్ని డిఫ్యూజ్ చేసారు.

"వెరీగుడ్ బాయ్స్! మీకు ఆ ఆలోచన రాకపోతే బాంబ్ దొరకటానికి టైమ్ పట్టేది. ఈలోపు పేలినా పేలేది!" అన్నాడు రాజేష్.

"స్వాతికే ఈ ఐడియా వచ్చింది!" అన్నాడు మహేష్.

అందరూ బయటికెళ్ళేసరికి అక్కడ స్వాతి ముందు దోషిలా చతుర్వేది ఉరఫ్ ముస్తాక్ నిలబడి వున్నాడు.

"అవును సార్! వీడు సరే. మరి కోమలి? అదే ముంతాజ్ ఎక్కడ?" అడిగాడు మహేష్.

నీకు అవసరమా అన్నట్లు చూసింది స్వాతి కోపంగా.

"అంటే బ్యాలెన్స్ ఎందుకని..." అన్నాడు మహేష్ నసుగుతూ.

"వీడిని నాలుగు తంతే...దాని సంగతి కూడా తెలుస్తుందిలే!" అంటూ వెళ్ళిపోయాడు రాజేష్.


✦ ✦ ✦

కిషోర్ వాళ్ళ అమ్మ వచ్చింది. స్వాతి వాళ్ళ పేరెంట్స్, అన్నయ్య వదిన వచ్చారు. పెళ్లి విషయాలు మాట్లాడుకుంటున్నారు. మహేష్, మదాలస కూడా వచ్చారు.

కిషోర్ మహేష్‌ను పక్కకు లాక్కెళ్ళాడు.

"అరేయ్ నాకో డౌట్!" అడిగాడు.

"ఏంట్రా!... పెళ్లి తర్వాత ఏం చేయాలా అనా?" అడిగాడు మహేష్.




"నీ బొంద!... నువ్వు కోమలితో అదే ఆ ముంతాజ్ తో కమిట్ అయ్యావా?" అడిగాడు కిషోర్.

"ఇప్పుడది ఎందుకు గుర్తొచ్చింది?" అడిగాడు కోపంగా మహేష్.

"కాదురా! ఉగ్రవాదులు ఎయిడ్స్ ద్వారా కూడా అటాక్ చేస్తారంట. నీ మీద ఆ అటాక్ ఏమైనా జరిగిందేమో...మదాలసను కాపాడదామని!" అన్నాడు కిషోర్.

"అంటే నా కోసం కాదు. మదాలస కోసమన్నమాట!" అన్నాడు మహేష్.

"నువ్వు ముందు విషయం చెప్పరా బాబు. టెన్షన్‌తో చచ్చిపోతున్నా!" అన్నాడు కిషోర్.

"నువ్వుటెన్షన్‌తో చస్తావేమో! నేను ఎయిడ్స్ తో చావాలిగా!" అన్నాడు మహేష్.

"అబ్బా! సర్లే ఆగు. ఆ రోజు ఓన్లీ బ్రేక్‌ఫాస్ట్ అయింది అంతే. లంచ్, డిన్నర్ లేవు" అన్నాడు మహేష్.

"నేనడిగిందేంటి? నువ్వు చెప్పేదేంటి?" అన్నాడు కిషోర్.

"నీయబ్బ. ఓన్లీ బ్రేక్‌ఫాస్టే కాబట్టి ఎయిడ్స్ రాదు. నువ్వు టెన్షన్ పడకు నాయనా! నువ్వు పెళ్లి ఆ తర్వాత శోభనం హ్యాపీగా చేసుకో!" అని వెళ్లిపోయాడు.

ఇంతలో స్వాతి వచ్చింది.

"ఏంటలా టెన్షన్‌గా వున్నావు?" అడిగింది.

"అది కాదు. ఆ కోమలితో అదే ముంతాజ్‌తో ఎంతవరకు ప్రొసీడ్ అయ్యాడో వీడు తెలియదు... ఎయిడ్స్ ఏమైనా వచ్చిందంటే చస్తాడని కంగారు నాకు. అదే అడిగితే బ్రేక్‌ఫాస్టే చేసాను ఎయిడ్స్ రాదంటాడేంటి..." అన్నాడు కిషోర్.

ఫక్కున నవ్వింది స్వాతి.

"ఇది కూడా నేనే క్లారిటీ ఇవ్వాలా?" అంది స్వాతి.

అవునన్నట్లు తలూపాడు కిషోర్.

"పెళ్లయ్యాక చేయబోయేది లంచ్!" అంది స్వాతి.

కాసేపు ఆలోచించాడు కిషోర్.

"ఏంటీ ఇంకా అర్థం కాలేదా?" అడిగింది స్వాతి.

"అర్థమైందిలే. సరేగాని ఇప్పుడు మనం లంచ్ ఎక్కడ చేద్దామంటావు?" అడిగాడు సీరియస్‌గా కిషోర్.

"ఆc!..." అంటూ భుజం మీద గుద్దింది స్వాతి.

"అబ్బా! నువ్వేమైనా చేయి కాని ఈ గుద్దులు మాత్రం ఆపు!" అన్నాడు కిషోర్.

వెనకనించి మహేష్ వచ్చి– "అవును తల్లీ వీడికిప్పటివరకు కలలో అన్నీ గుద్దులే. రియల్ లైఫ్‌లో మాత్రం వాడి ఆశలను అడియాస చేయకు!" అని నవ్వాడు.

టీవీలో న్యూస్ వస్తోంది.

"ఇనార్బిట్ మాల్ లో బాంబ్ బ్లాస్ట్‌కి ప్లాన్ చేసినవారిలో మహిళా ఉగ్రవాది కూడా పోలీసుల చేతికి చిక్కారు."

"అరేయ్ నీ బ్యాలెన్స్ పూర్తయిపోయింది" అన్నాడు కిషోర్ నవ్వుతూ.

–అయిపోయింది–



# అనంత భావాలకు వేదికలు కార్టూన్లు

విజయవాడ, చిట్టూరి హైస్కూల్ సెమినార్ హాలులో- ది.19-09-2021న బాచి పురస్కారం2021, సోమయాజుల శివరామయ్య హైమావతి కార్టూన్ పోటీల బహుమతి ప్రదానోత్సవం జరిగింది.

ఈ సభకి ముఖ్య అతిథులుగా శ్రీయుతులు ఏవీఎమ్‌గారు, కె.వి.వి.సత్యనారాయణగారు, బాచిగారు, రాము.పి. గారు పాల్గొన్నారు. సభా కార్యక్రమం చిరంజీవి శ్రీకర్ ప్రార్థన గీతంతో ప్రారంభమయింది.

పోటీ నిర్వాహకులు శ్రీ బాచిగారు మాట్లాడుతూ- "ఎన్నో వ్యయ ప్రయాసాలతో నిర్వహిస్తున్న ఈ పోటీలు విజయవంతం చేస్తున్న కార్టూనిస్టులకు కృతజ్ఞతలు. అలాగే ఈ పోటీలో భాగం పంచుకున్న శ్రీ ఎస్.వి.రమణగారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ సీనియర్ కార్టూనిస్ట్ శ్రీఏవీఎమ్‌గారు- "అనంతమైన భావాలకు కార్టూన్లు ప్రతిబింబాలనీ, కార్టూన్లు సమాజానికి దిశ నిర్దేశం చేస్తుందని అన్నారు. కార్టూనిస్టులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఈ నెల నుండి హాస్యానందానికి వచ్చిన ఒక మంచి కార్టూన్‌కి ప్రతి నెల 1000 రూపాయలు ప్రోత్సాహక బహుమతి ఇస్తానని అందరి హర్షాధ్వానాల మధ్య ప్రకటించారు.

కార్టూన్ ఇష్టులు, కార్టూనిస్టుల శ్రేయోభిలాషి శ్రీ కె.వి.వి. సత్యనారాయణగారు మాట్లాడుతూ- "కార్టూన్లంటే నాకు చాలా ఇష్టం! మన తెలుగు కార్టూనిస్టులు మరిన్ని మంచి కార్టూన్లు వేయాలనే ఉద్దేశంతో ప్రతినెలా హాస్యానందంలో ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నాను." అని అన్నారు. "మనకు కార్టూన్లు ఎక్కువగా పురుషులే వేస్తున్నారనీ, మహిళా కార్టూనిస్టులు చాలా తక్కువగా ఉన్నారని అందుకనే త్వరలో హాస్యానందం వేదికగా మహిళలకే కార్టూన్ పోటీలు నిర్వహిస్తామని" మాటిచ్చారు.

హాస్యానందం సంపాదకులు రాము మాట్లాడుతూ- కార్టూన్ల ద్వారా పాఠకులు హాస్యాన్ని ఆస్వాదిస్తారని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. హాస్యానందం వేదికగా నిర్వహిస్తున్న కార్టూన్ల పోటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు" తెలిపారు. "అలాగే వచ్చే తరం వారికి కూడా కార్టూన్ల పై అవగాహన ఏర్పరచి, యువ కార్టూనిస్టులను తయారు చేయాల'ని కోరారు. అనంతరం కార్టూనిస్ట్ రామ్‌శేషను సోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక పురస్కారంతో సత్కరించారు. కార్టూన్ ప్రోత్సాహకులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణ బాచి పురస్కారం పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

ప్రముఖ కార్టూనిస్టు శ్రీ ఏవీఎమ్‌గారు సోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు.

కార్యక్రమాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కప్పగంతు రామకృష్ణ నిర్వహించారు.

















శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
**రెండవ బహుమతి పొందిన కథ**

# అమెరికాలో పని'మనిషి'

అనిశెట్టి సతీష్ కుమార్,
9989353934

**ఆకాష్ అప్పుడే అమెరికాలో కుడికాలు పెట్టాడు అత్తారింట్లో ఆడపిల్ల అడుగు పెట్టినట్లు. ఒక విధంగా అమెరికాలో ఉద్యోగానికి వెళ్ళేవారందరూ అమ్మానాన్నలను విడిచి అత్తారింటికి వచ్చినట్లే.**

**ఆకాష్ అతని భార్య ఇద్దరూ కలిసి నెలకు పదిహేను వేల డాలర్ల చొప్పున ముప్పై వేల డాలర్లు సంపాదిస్తారు. ప్రస్తుతానికి ఒక అద్దింట్లో వుంటున్నారు.**

**ఇద్దరూ సూర్యుడితో పోటీపడి ఉదయాన్నే లేచి సూర్యుడి చేతిలో ఓడినట్లు సూర్యుడు వెళ్ళాకా ఇంటికి వచ్చేవాళ్ళు.**

ఇంట్లో అన్నీ యంత్రాలతోనే పనైనా... ఆ యంత్రాలని ఆన్, ఆఫ్ చేసే మనిషే వారికి ఇప్పుడు అవసరం.


గూగుల్ తల్లి వారిని త్వరగానే కనికరించింది. కరుణ చూపే కాళీమాతలా జ్యోస్ అనే మహిళ కనిపించింది. వెంటనే ఇంటి పని గురించి మాట్లాడటానికి రమ్మని ఫోన్ చేసాడు. వాళ్ళు చెప్పిన రోజు సమయానికి తనకు వీలుకాదని తానే వచ్చే శనివారం మధ్యాహ్నం రెండు గంటకు వస్తానని అపయింట్మెంట్ ఇచ్చేసింది విదేశంలో పనిచేసే పనిమనిషి.

ఆ శనివారం రానే వచ్చింది.

ఆ పని కోసం వచ్చిన మనిషి ఆకాష్ ఇంటికి రాగానే సోఫాలో దర్జాగా కూర్చుంది.

'జ్యోస్' ఆ పేరు ఆన్‌లైన్లో చూసినప్పుడు ఏ విదేశీ అమ్మాయో అనుకున్న ఆకాష్... వచ్చిన అమ్మాయి ఆంధ్రా అమ్మాయని తెలిసి ఆశ్చర్య పోయాడు. తేరుకొని ఆకాష్ ఏదో చెప్పేలోపే–

"నేను ఉదయం 8 గంటలకు వస్తా, గంట సేపే ఉంటా, నేను వచ్చేవరకు మీ వాడిన వంట పాత్రలు డిష్‌వాషర్‌లో ఉండాలి... బట్టలు వాషింగ్‌మెషిన్‌లో వేసి ఉండాలి... వాక్యూమ్ క్లీనర్ సిద్ధంగా ఉండాలి. తొమ్మిది దాటాక ఒక్క నిమిషం కూడా ఉండను. వీకెండ్స్ నాకు శలవు. మీకూ శలవే కాబట్టి మీ పనులు మీరే చేసుకో వాలి. జీతంగా నెలకు ఐదు వందల డాలర్లు ఇవ్వాలి. ఇవన్నీ మీకు ఓకే అయితే నా మెయిల్‌కి మెయిల్ చేయండి...ఉంటాను!" అని జ్యోస్ జోష్ తో చెప్పేసరికి, ఆకాష్ హోష్ ఎగిరిపోయింది.



ఎంత ఆలోచించిన జ్యోస్ నిబంధనలను ఒప్పు కొని పనికి కుదుర్చుకోవడం తప్ప వేరే మార్గం భూతద్దంలో వెతికినా దొరకలేదు.

జ్యోస్ ని పనికి రమ్మని మెయిల్ చేసాడు.

డబ్బులు ఎక్కువే అయినా చెప్పిన సమయా నికి వచ్చి చెప్పిన పనులు చేసేది జ్యోస్. ఆకాష్ ఆఫీస్ దూరం కావడంతో తన భార్య కన్నా ముందే బయలుదేరేవాడు.

ప్రతిరోజు ఆఫీస్‌కి వెళ్లేముందు తన ఇంటి బయట ఆకాష్ వాడే కారు కన్నా ఖరీదైన కారు ఉండేది. దాన్ని చూస్తూ ఇలాంటి కారు తాను కొనగలుగుతాన అని అనుకునేవాడు. కొన్ని రోజులు గడిచాక ఆకాష్ సొంత ఇల్లు కోసం ఒక ప్లేస్ చూసాడు. దాని ఎదురుగా జ్యోతి నిలయం అనే ఓ పెద్ద ఖరీదైన భవంతిని చూసాడు. అలాంటి ఖరీదైన భవంతి కాకున్నా కనీసం ఓ మాదిరి ఇల్లు కట్టుకుందాం అనుకు న్నాడు. ఎదురుగా మనదేశం వాళ్ళు వుంటారు కదా బాగుంటుంది అనుకున్నాడు.


ఆకాష్ ఇల్లు పనులు పూర్తయ్యాయి.

గృహప్రవేశ పనుల కారణంగా ఆకాష్ ఆఫీస్‌కి ఓ రెండు రోజులు సెలవు పెట్టాడు.

బయట నిల్చున్న ఆకాష్ రోజు చూసే ఖరీదైన కారు రావడం చూసి, ఎవరిదీ కారు అని ఆత్రంగా చూసాడు ఆకాష్.

కారు దిగిన వ్యక్తిని చూసాక దిమ్మతిరిగి బొమ్మ కనిపించింది.

"హాయ్ సార్!" అంటూ అందంగా దిగింది పని'మని'షి జ్యోస్. ఓ అరగంట తర్వాత గానీ షాక్ లోంచి బయటకు రాలేదు ఆకాష్.



మెల్లగా తనకు తాను ఏదో సర్ది చెప్పుకొని నీరసంగా ఇంట్లోకి వెళ్ళాడు. నిజమే అని తెలిసినా మళ్ళీ ఒకసారి తెలుసుకుందామని "ఆ కారు నీదేనా?" అని జ్యోస్‌ని అడిగాడు.

"అవును! కొని ఐదు సంవత్సరాలయ్యింది. తీసేసి ఇంకో కొత్త మోడల్ వచ్చిందట అది కొందాం అనుకుంటున్నాను." అని ఇంకో బ్రేకింగ్ న్యూస్ ఇచ్చింది ఆకాష్‌కి.

తనని తాను సముదాయించుకొని–

"రేపు మా కొత్తింట్లో గృహప్రవేశం ఉంది. నువ్వు మీ కుటుంబ సభ్యులు రండి." అని ఆకాష్ చెప్పాడు.

ఎక్కడా ఎలా రావాలో అడిగిన జ్యోస్‌కి–

"ఇక్కడికి తూర్పున ఓ ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆ ఇంటికి ఎదురుగా జ్యోతినిలయం అనే పెద్ద భవంతి ఉంటుంది. అక్కడికి వచ్చి... ఎవరిని అడిగినా జ్యోతి నిలయం అడ్రస్ సులభంగా చెప్పేస్తారు." అని అన్నాడు.


ఆకాష్ మాటలు విన్న జ్యోస్... పకపకా నవ్వి– "ఆకాష్ సార్! ఆ జ్యోతి నిలయం నాకు తెలుసు!" అని ఇంకా ఏదో చెప్పబోగా...

"ఆ ఇంట్లో కూడా నువ్వే పనిచేస్తావా?" అని అడిగాడు ఆకాష్.

'అవును! పన్నెండు గంటలు అక్కడే పని చేస్తాను! ఎందుకంటే ఆ జ్యోతినిలయం ఎవ రిదో కాదు మాదే!... నా పేరు జ్యోతి... అమెరికాకు వచ్చాక స్టైల్‌గా ఉంటుందని జ్యోస్ అని పేరు పెట్టుకున్నాను. నా పేరు మీదనే జ్యోతి నిలయం అని పెట్టారు. నేను, మా ఆయన, మా అత్తమ్మా,మమయ్యాలు అందరం కలిసి నెలకు ఓ అరవైవేల డాలర్లు సంపా దిస్తాం"... అని చెప్పి, మళ్ళీ ఫక్కున నవ్వి ఆకాష్ గుండెల్లో అణుబాంబు పేల్చింది జ్యోస్ అలియాస్ జ్యోతి.

అప్పుడు అర్థమయ్యింది తన ఇంట్లో ఉంది పనిమనిషి కాదు పని'మనీ'షి అని.

అమెరికాలో సాఫ్ట్‌వేర్ జాబ్ కన్నా పనిమనిషి ఎక్కువగా సంపాదిస్తుందని తెలిసి ఖంగు తిన్నాడు ఆకాష్.





శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన
కథ

# 'బోబోరె'

డాక్టర్ తేజస్వి పారుపూడి
765 714 8809

**రాఘవరావు రిటైరయిన నెల్లాళ్లకి కొడుకు వంశీ ఆయనకిష్టమైన మనవల మీద రకరకాల ఒట్లు పెట్టి బలవంతంగా ఓ ఆరు నెలలు తన దగ్గరుంచుకోడానికి న్యూయార్కు మహానగరానికి తీసుకొచ్చాడు.**

కోడలు సుందరి ఎంతో అభిమానంగా చూస్తుంది. మనవరాలు మనవడి కబుర్లతో రోజూ కాలక్షేపం అయిపోతున్నా డైనింగ్‌టేబుల్ దగ్గరకి వచ్చేసరికి మాత్రం రాఘవరావు ప్రాణం ఏదో గింజుకున్నట్టే వుంటోంది.

కారణం బ్రేక్‌ఫాస్ట్ టైంకి డైనింగ్ టేబుల్ మీద నానాజాతి సమితిలా కుప్పలా పోసుకున్న ఆకు కూరలు క్యారెట్లు, టమాటా, క్యాబేజీ లాంటి రకరకాల పచ్చి కూరగాయల ముక్కల్ని వేళ్లతో నోట్లోకి బలవంతంగా తోసుకుంటూ దర్శన మిస్తుంది కోడలు.


"అదేమిటమ్మాయ్?"... అంటే విపరీతంగా పెరిగిపోయిన తన ఊబవొళ్లు తగ్గడానికి అదో రకం కొత్త వైద్య ప్రక్రియట. కదలిక లేకుండా గంటల తరబడి ఆఫీసుల్లో కూర్చునే పనిచేస్తుంటే ఒళ్లు రాక ఏంచేస్తుందని వీళ్లకెపుడర్థమవు తుందో?

తను వచ్చి నెల్లాళ్లవుతున్నా వంశీ ఎపుడూ గుండుతోనే కనిపిస్తుంటే పట్టలేక అడిగేసాడు రాఘవరావు.

"అదేమిట్రా అబ్బాయ్! ఇదెక్కడి దిక్కుమాలిన ఫ్యాషనురా! తుమ్మెద రెక్కల్లాంటి జుట్టు ఉంచుకోక రాగి చెంబులా ఎప్పుడూ ఈ గుండేమిటి?" అని.

'ఆఫీసు టెన్షన్లకి తుమ్మెదలెప్పుడో ఎగిరి పోయాయి నాన్నా! ఆ ఫ్లాష్‌బ్యాక్ గుర్తుకు వస్తేనే ఒళ్లు జలదరిస్తుంది. మొదట్లో ఒకటో రెండో వెంట్రుకలు...తర్వాత గుప్పెళ్ల కొద్దీ ఊడిఊడి చివరికి నలభై రాకుండానే రాగి చెంబు మిగి లింది. మళ్లీ మొలుస్తాయన్న ఆశతోనే ఇదిగో ఇలా రాగులు జొన్నలు, సజ్జలు లాంటి చిరు ధాన్యాలన్నీ ఓ పావుకేజీ నానబెట్టి పొద్దుటే ఆ మొలకలలో రెండు చెంచాల కాకరరసం కలిపి






తాగుతున్నా...దోషమంతా విరేచనంలో పోయి జుట్టు మొలుస్తుందని ఓ ఇండియన్ డాక్టరు చెప్పాడులే." అన్నాడు వంశీ గుండు నిమురు కుంటూ.

'కుంకుడుకాయలలొదిలేసి... నానారకాల జిగురు షాంపూలు వాడితే జుట్టుని తినెయ్యవా మరి?' నిట్టూర్చాడు రాఘవరావు.

"మమ్మీ!... నేను స్కూలుకెళ్తున్నా... నాకు లంచ్ బాక్సులో బ్రెడ్ టమాటా జ్యూస్ సర్దావా లేదా?" అంటుంది మనవరాలు.

అదేమిటే అంటే...

'ఇలా మూడు నెలలు కంటిన్యూగా చేస్తే మొటిమలు తగ్గుతాయిట తాతయ్యా!"... అంటుంది పదేళ్ల లేతబుగ్గలని అద్దంలో బాధగా చూసుకుంటూ.

పోనీ అతిథులు వచ్చినపుడయినా కాస్త తెలుగురుచులు జిహ్వాకి తగులుతాయి అనుకున్నాడు.

కానీ వచ్చినవాళ్లు తెచ్చిన కూరలు, పులుసులు, పులిహోరలు మిగిలిపోయినన్నీ ఫ్రిజ్జులో పెట్టేస్తారు... పొద్దున్నా మధ్యాన్నం రాత్రి ఓ వారం రోజులపాటు ఒకే రకమైన వంటకాలు తిని తినీ... ప్రాణం విసిగెత్తి పోతోంది.

వాళ్లకి డయటింగులు మూలాన రోజూ తనే బలి అయిపోతుంటాడు.

పాచి వంటకాలు తినకూడదని ముసుగు తన్ని పడుకున్న తండ్రిని ఆరోజు ఆఫీసునుంచి రాగానే లేపి ప్రేమగా కూర్చోబెట్టాడు వంశీ.

"ఇవాళ నిన్ను రోబోలు సర్వ్‌చేసే 'బోబోరె' అనే కొత్త ఇండియన్ హొటల్‌కి వెళదాం... త్వరగా తయారవు!"

ఇండియన్ అనగానే రాఘవరావుకి ప్రాణం లేచొచ్చింది... ఎంచక్కా ఇడ్లీలో, దోసెలో, పెసరట్లో తినొచ్చని. వెరయిటీ పిచ్చి ఉన్న కోడలు, పిల్లలు కూడా రోబోలు అనగానే సరదా పడ్డారు!


✦ ✦ ✦

రెండు గంటలు ట్రాఫిక్ తట్టుకుంటూ డ్రైవ్ చేసాక తన చిన్న తనంలోని కాకా హొటల్‌లా ఉన్న ఆ ఆకులు కప్పిన 'బోబోరె' ని చూసి విస్తుబోయినా క్యూ కట్టిన ఇండియన్లని ఫారినర్లని చూసి కాలరెగరేసాడు రాఘవరావు.

"చూసావా నాన్నా!... ఇక్కడి 'అ.గం.నీ' స్పెషల్ డిష్ కోసం ఎంత డిమాండో? అందుకే డబుల్ పేమెంట్ చేసి అడ్వాన్స్‌గా ఆర్డర్ చేసాను."

ఓ గంట వెయిట్ చేసాక లోపలికి తీసికెళ్లి ముచ్చటగా తీర్చిదిద్దిన ముగ్గుల మీద కూర్చోబెట్టారు.

పంచెలు కట్టుకున్న బోబోలనే చిట్టి రోబోలు



పిల్లలకి... పెద్ద రోబోలు పెద్దలకి ముసి ముసి నవ్వులతో షేక్ హ్యాండిచ్చి మురిపించాయి... తర్వాత చిత్రవిచిత్రంగా నడ్డి తిప్పుకుంటూ రంగురంగుల మట్టి ముంతల్లో తెచ్చిన 'అగంనీ' దానితోబాటు మరో రెండు రంగుల పిడతల్లో సర్వ్ చేసిన ఆకుపచ్చని, ఎర్రని ద్రవా లను చూసి అంతా థ్రిల్లయిపోయారు.

ఆ పక్కనే వయొలెట్ కలర్‌లో ఉల్లితొక్కు, ఉప్పు తెచ్చాయి ఇంకో రెండు బోబోలు.

'అగంనీ'లో తెల్లగా తేలుతున్న మరమరాల వంటి పలుకులు చూసి కోడలు పిల్లలకి ఒకటే సంబరం.

తను కూడా తినడం పూర్తయ్యాక–

లొట్టలేసు కుంటూ జుర్రుకుంటూ 'అగంనీ' ఆస్వాదిస్తూ సెల్‌లో ఫొటోలు తీసుకుంటూ 'వావ్' అంటూ ఉక్కిరిబిక్కిరవుతున్న కష్ట మర్లను చూసి ముసి ముసిగా నవ్వుకున్నాడు రాఘవరావు.

ఇంటికొచ్చాక...

"అగంనీ' నీకు నచ్చింది కదూ నాన్నా!... నీ మొహంలో ఇన్నాళ్లకి ఎంత సంతోషమో!" అన్నాడు వంశీ.

"సంతోషం కాదురా ఆశ్చర్యం!... ఇంతకీ బిల్లు ఎంత బాదాడేమిటి?" అన్నాడు రాఘవరావు.

"అబ్బే... ఎంతోనా 400 డాలర్లు నాన్నా!"


"అంటే మన రూపాయిల్లో 30వేలన్న మాట. రెస్టారెంట్ పెట్టిన తెలుగువాడెవడో గానీ మహా తెలివైన వాడురా. రాత్రి గంజి నీళ్లలో అన్నం వేసి... సువాసనకి నాలుగు ఆకులు పడేసి పులియబెట్టి ఎంతలా సొమ్ము చేసుకుంటున్నాడో? పక్కనే ఆవకాయ కలిపిన ఎర్ర నీళ్లు... కొత్తిమీర పేస్టుతో ఆకుపచ్చనీళ్లు. గుర్తుపట్ట లేదురా నువ్వు?"

"అగంనీ' అంటే అన్నం, గంజి, నీళ్లు అని తిన్నాకనే తెలిసింది నాన్నా! చిన్నప్పుడు స్కూలు కెళ్లేటపుడు బామ్మ పెట్టిన తరవాణి అన్నం ఎలా మర్చిపోతాను? మీ కోడలు పిల్లలు అవె రగరు కనుక వాళ్లకి థ్రిల్లే. అసలు అమెరికాలో వెరయిటీ పేరు ఉంటే చాలు జనం ఎంత డబ్బయినా పోస్తారు నాన్నా! అందుకేగా బోబో రెస్టారెంట్‌కి అంత డిమాండ్."

రాత్రి తెల్లవార్లూ 'బోబో ఆకర్షణతో మూడు ముంతల గంజినీళ్ల అన్నానికి ముప్ఫయివేలు' వసూలు చేస్తున్న రెస్టారెంటు యజమాని తెలివికి జోహార్' అని తలుచుకుని తలుచుకుని నవ్వుకుంటున్న తండ్రిని ఆర్ద్రంగా చూసాడు వంశీ.


# అహింసా దినోత్సవం

చక్రవర్తి











శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన
కథ

# పూర్ణమ్మత్త - పొర్లు దండాలు

ఆదూరి హైమావతీ శ్రీనివాసరావు,
8790224030.

**పూర్ణమ్మత్త కొడుకు అమెరికాలో సెటిలయ్యాడు. అతనికి గ్రీన్‌కార్డ్ రాగానే పూర్ణమ్మత్తా బయల్దేరొచ్చింది. అత్తకో మనవరాలు పుట్టింది. తనపేరు పెట్టాలని పట్టుబట్టి మనవరాలికి 'పూర్ణ' అనేపేరు పెట్టింది. ఆమె మాటకు తిరుగులేదు మరి. అతి గారాబం చేయటం వలన తిండిలో ముందంజ, చదువులో వెనుకంజ వేసింది 'పున్న'.**

**అది ఆమె బామ్మ పిలిచే ముద్దు పేరు లెండి.**

'పున్న' బామ్మ తినిపించే మీగడ పెరుగు, చిక్కని పాలు, నెయ్యితో పూర్ణంబూరే లాగా తయారై, ట్వెల్త్ గ్రెడ్లో అత్తెసరు మార్కులు రావటాన మంచి స్కూల్లో సీటు రాలేదు.

"స్వామీ! పొర్లుదండాలు పెట్టిస్తాను. సీటిప్పించండి!" అని కులదైవమైన వెంకటేశ్వర స్వామికి మొక్కుకుంది పూర్ణమ్మత్త.

ఖర్మకాలి నేనూ అమెరికాలో ఉండటాన వారానికో రోజు అటు వెళ్ళి పూర్ణం బూరెలు తిని రాక తప్పట్లేదు. ఆస్వామి మహిమో, అత్త ప్రార్థనో పున్నకు సీటు రానే వచ్చింది.

ఆ ఆదివారం–"నాయనా!నాగూ! సీటొస్తే పొర్లు దండాలు మొక్కున్నారా!" అంది అత్త.

"మంచిది చేయించత్తా!" అన్నాను నేతిలో పూర్ణం ముంచుకు తింటూ...

"అదేలాగురా! ఎవరో ఒకరు ఒప్పుకుంటేనే కదా!" అందత్త.

"పొర్లు దండాలకు మరొకరు ఒప్పుకోడమేంటత్తా! పున్న ఒప్పుకుంటే చాలుగా!" అన్నాను.

"అదెక్కడ చేస్తుందిరా పసికూన."

"మరి సీటు దానికే కదా వచ్చింది!"


"పొర్లుదండాలు 'చేయిస్తా'నన్నాను కానీ పున్న చేత కాదురా!" అంది అత్త.

"ఓస్! దేవుడికీ బురిడీ కొడుతున్నావా అత్తా!" అని నేను ఆశ్చర్యపడేలోగానే, అత్త కొడుక్కేసి చూసింది–

"అమ్మా! నాకిలాంటివన్నీ పెట్టకు... అసలే అమెరికా. ఇండియాలాగా తడిగుడ్డకట్టుకుని... ఆలయం చుట్టూ ఎలాపొర్లుతారే! మొక్కుకునే ముందు ఆలోచించొద్దూ! నన్నన్నా అడగొద్దూ!" అని కోప్పడి, లోని కెళ్ళిపోయాడు అత్తకొడుకు.

అత్త కోడలుకేసి చూసింది.

"ఆంటీ! ఇవన్నీ నా వల్లకావు. ఐనా అమెరికాలో అరోరా టెంపుల్లో పొర్లు దండాలు చేస్తుంటే అంతా వీడీయో తీసి అప్లోడ్ చేస్తారు. లోకమంతా పాకుతుంది... ఇదేం మొక్కూ!..." అంటూ లోనికెళ్ళింది.



ఇహ మిగిలింది నేను నా పూర్ణంబూరె.

"నీమాటేంటిరా?" అంది అత్త.

"నాకేం పట్టిందే అత్తా! నీ మనవరాలూ నీవూనూ..." అంటూ పూర్ణం పూర్తి చేసి లేచాను.

"ఇక్కడ డబ్బిస్తే అన్నీ చేస్తారుటగా! ఆ పురోహితునికి ఫోన్ చెయ్యి!" అంది.

"అత్తా! అవేవో నీవే చేసుకో... నన్నీ పంకంలోకి లాగకు." అంటూ లాన్స్‌లో చైర్లో కూర్చున్నాను, ఆయాసం తీర్చుకోను. నాదీ కాస్తంత భారీకాయమేలెండి.

అత్త ఫోన్ కొట్టడం పూజారిగారు కార్లో రావడం పావు గంటలో జరిగింది.

పూజారులకు అత్త భారీగానే దక్షిణ ఇప్పిస్తుంటుంది.

పూజారికి కాఫీ మర్యాదలయ్యాక–

"నాయనా! నాబిడ్డ లాంటి వాడివి, పైగా తెలుగొచ్చిన అమెరికా బిడ్డవు. నా మనవరాలికి సీటొస్తే పొర్లు దండాలు పెట్టిస్తానని మొక్కున్నానయ్యా! నీవీ సాయం చేసి పెట్టాలి. కావల్సినన్ని డాలర్స్ ఇప్పుడే ఇప్పిస్తాను!" అంది.

"దాందేముందండీ! అరోరాలో ఒప్పుకోరు... రష్షుంటుంది కదా!... మరొక వెంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. అక్కడ చుట్టూతా రాళ్ళే. అక్కడ ఏర్పాటు చేయిస్తాను." అన్నాడా పూజారి.

"నా బంగారు తండ్రే! ఎంతవుతుందో చెప్పు ఇప్పుడే నా కొడుకునడిగి ఇప్పించేస్తాను." అంది అత్త.

"అంత ఎక్కువేం కాదు లెండి. వంద డాలర్లు చాలు."

"అంతేనా!... మరి తడి పంచే అదీ నీవేతెచ్చుకుంటావా! నన్నే తెమ్మంటావా!" అంది అత్త.

"నేను తడి పంచె కట్టుకోనక్కర్లేదండీ! ఎవరు పొర్లు దండాలు చేస్తారో... వారు కట్టుకుంటే చాలు." అంటూ తన భారీ కాయాన్ని మెల్లిగా సోఫాలో కదిలించాడు ఇహ వస్తానన్నట్లు.

"అదేంటి నాయనా! పొర్లుదండాలు చేసేది నీవేగా!" అంది.


"అదేంటీ?... మీ మనవరాలికి సీటొస్తే ఆమె చేయాలి కానీ నేనెలా చేస్తాను!?" అంటూ లేచాడు.


"కూర్చో! కూర్చో!! మరి వందడాలర్లెందుకయ్యా!" స్వరం పెంచి అడిగింది అత్త.


"ఎందుకంటే ఏర్పాట్లు చేయడానికి! మీరు పొర్లు దండాలు పెట్టిస్తానని దేవుడ్నీ మోసం చేస్తే చేశారు నన్ను మాత్రం చేయలేరు." అంటూ లేచి లగెత్తాడు కారువేపు.

నేనూ అతడెనకాలే నా కారుకేసి లగెత్తాను మా అత్తకు భయపడి.

## దసరా వేషాలు






హాస్యబ్రహ్మ

# శంకరనారాయణ ఫన్ ప్రశ్నలకు-
# సుదర్శనమ్ పంచ్ సమాధానాలు



*Cartoons: Sangram*



✦ మీ రచనలు ఏమైనా 'పెన్'డింగ్'లో ఉన్నాయా?

**'ఫన్'డింగ్ కోసం ఎదురు చూస్తున్నాయి... మీరేమైనా సెండింగా ఆ ఫండింగ్?!**

✦ అర్ధాంగి మగాడికి ఎడమ పక్కన ఉంటుంది! జేబు కూడా ఎడమ పక్కనే ఉంటుంది! అంటే జేబులోన డబ్బులంతా భార్యకేనా?



**అర్ధాంగి... ఈ పక్క ఆ పక్క అనేం లేదు... ఏ పక్కైనా ఉంటుంది! అలాంటప్పుడు మగాడికి (మొగుడికి) జేబులెందుకు సామీ... చేతులెట్టుకుని ఖాళీగా తిరగటానికా?!**



✦ దశ దిశలు అంటారు కదా? దిక్కులు ఎనిమిదే కదా? ఏమంటారు? మీ దిక్కున్న చోట చెప్పుకోమంటారా?

**నేను ఏమంటానో కూడా మీరే చెప్పేసారు... జీనియస్సులు అంతే!... ఏదీ మనల్ని చెప్ప నివ్వరు... అన్నీ వాళ్ళే చెప్పేస్తారు!**

✦ గురువు గురువు అనడం కూడా బతుకుతెరువులో భాగమేనా?




**వాళ్ళు అనిపించుకుంటారు సరే సార్... వీళ్ళు గురూగారు గురూగారు అని వాళ్ళ చుట్టూ తిరిగితే చివరాకరికి గు...గు...గూబ పగలకొట్టేవాళ్ళున్నారు.**

✦ ఆడవాళ్ళలో 'జడ' పదార్థాలు' ఎక్కువా? 'ముడి' పదార్థాలు ఎక్కువా?



**జడ, ముడి పదార్థాలు ఇప్పుడెక్కడున్నాయి(రు) మహాప్రభో...? ఇప్పుడంతా విడివిడిగా తడి, పొడి పదార్థాలే!!**

✦ మనిషికి జుట్టు అందమిస్తుందా? పట్టు అందమిస్తుందా?



**జారితే మొదటిది... కడితే రెండోది... అందగిస్తుంది అతివలకి! పట్టు దొరికితే మొదటిది... కట్టు జారితే రెండోది కూడా అందమే మరి!!**



✦ మీరు తపస్సు అంటూ చేస్తే మోక్షం కోసం చేస్తారా?...రంభా, ఊర్వశిల కోసం చేస్తారా?

**మోక్ష మనగా నేమి?... రంభా ఊర్వశులు లభించుటయే కదా!! కాదా?!!**



✦ పెద్దలు ఎవరైనా మిమ్మల్ని 'సుదర్శన ప్రాప్తిరస్తు' అని దీవిస్తే ఏమేమి చూడాలని కలలు కంటారు?

**దీవించాక, ఇంకా కలలెందుకండీ... ఫలాలందుకోవడమే!**


✦ కోర్టుల్లో వ్యాపించేది 'దావా'గ్ని అంటాను... మీరేమంటారు?


**మీలాంటి 'వ్యాజ్య'పేయులు అన్నాక, నేనేమంటాను? పైగా, కోర్టు పక్షులతోను, కక్షి(క్ష)దారులతోను నాకంతగా పరిచయం లేదు... మీతో తప్ప!!**



✦ బ్రహ్మచారిని 'గుడ్‌నైట్' అని ఆశీర్వదిస్తే అది ఎలా నిజమవుతుంది?

**'గుడ్‌నైట్‌లుండేవి బ్రహ్మచారులకే...! మీరు వాళ్ళనేం ఆశీర్వదించనక్కర్లేదు! అంతగా జాలి కలిగితే... పాపం... మగసంసారుల కివ్వండి మీ ఆశీస్సులు!!**





✦ 'అంతా విష్ణు మాయ' నిజమే! అందులో ఎన్ని కుంభకోణాలు ఉంటాయి? ఎన్ని రంభకోణాలుంటాయి?


**మొత్తానికి మీరు కోణాలన్నీ తెల్సిన లెక్కల(ల్లో) మనిషిలా ఉన్నారే... నారాయణ...నారాయణా...! మీరు మాట్లాడే 'రంభాకుంభ' కోణాలన్నీ కృష్ణలీలకి సంబంధించినవి... విష్ణుమాయకి కాదు!**





✦ వెండితెరను బంగారు తెర అని ఎందుకు అనలేదు?

**తెరమీద 'మెరిసేదంతా' బంగారం కాదని సింబాలిక్‌గా చెప్పడానికేమో!!**



✦ బట్టలు విప్పేస్తే శృంగారం వంటపడుతుందా? వేదాంతం వంటపడుతుందా?

**'విప్పిస్తే' శృంగారం... 'విప్పేస్తే' వేదాంతం వంటబడతాయంటారు అనుభవజ్ఞులు! మీకు మాత్రం వేమన యో(భో)గి బాగా వంటబట్టినట్టున్నాదే!!**




✦ టోపీలు కుట్టి ఆ డబ్బుతో జీవించే వాడటా ఔరంగజేబు... మీరు గుండుతో అలా ఉండకుండా టోపీ పెట్టి జేబు నింపుకో వచ్చుగా?

**మాలాంటి 'గుండు' ఆసాములు పెట్టు కుంటారే తప్ప... పెట్టరు... టోపీలు!! మీరు ట్రై చేయకూడదా సామీ?**


✦ వెండితెర మీద మీరు కనిపిస్తారు...'తెర' చాటున ఏమయినా ఉన్నాయా?

**తెరమీద కనిపించే వాళ్ళకి చాటు మాటులుండవు... అన్నీ బట్టబయలే! మీ సంగతే తేల్చండి!**



✦ 'జాయింట్ పెయిన్స్' అంటారు గాని... అది కూడా శరీరంలో ఒక్కరికే వస్తుందేమిటి? ఇద్దరికో... ముగ్గురికో కలిపి రావాలి గానీ!

**ఇద్దరికీ, ముగ్గురికీ కలిసి వచ్చే జాయింట్‌పెయిన్స్ యవ్వారాలు నాకెలా తెలుస్తాయి సామీ... మీ షీక్రెట్ మేటర్స్‌లోకి నన్ను లాక్కండి!**







శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
**ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# ప్రవాస 'ఆంధ్రుడు'

యం. రమేష్ కుమార్,
83095 54170

**మొదట్నుంచీ విదేశాలన్నా, ఆ కల్చర్ అన్నా శర్వానందానికి ఎంతో మోజు. సాయంత్రం అమెరికా నుంచి శర్వానందం ఫ్రెండు అశోక్ పరిమి దిగుతున్నాడు. అక్కడేదో ఒక మంచి అవకాశం వుందనీ వీలైతే శర్వానందాన్ని అమెరికా తీసుకెళ్తాననీ చెప్పాడు. ఇక్కడ ఓ కంపెనీలో చిన్న జాబ్ చేస్తున్న శర్వానందానికి ఇది బంపర్ ఆఫర్!**

శర్వానందం భార్య లతకి కూడా కంగారుగానే వుంది.

"నువ్వేం కంగారు పడకు. అమెరికా నుంచి వస్తున్న వాణ్ణి మెప్పించడమెలాగో నాకు బాగా తెలుసు. అమెరికా తీసుకువెళ్ళడానికి నేనే సరైన మనిషిని అని వాడు అనుకునేట్టు చేస్తాను!" ధీమాగా అన్నాడు శర్వానందం.

ఆరోజు సాయంత్రం నాలుగు గంటల వేళ అశోక్ పరిమి రానే వచ్చాడు.

సోఫాలో అతడు సుఖాసీనుడయ్యాక, ఓ గాజు గ్లాసులో డైట్ కోక్ పోసి ఇచ్చింది లత. ప్లేటులో అప్పుడే కరకరలాడేలా వేయించి వుంచిన ఫ్రెంచి ఫ్రైస్ కూడా పెట్టింది.

అశోక్ వాటి వైపు అట్టే చూసి– "ఇప్పుడివేం వద్దు! కాస్త మజ్జిగ వుంటే తాగుతాను!" అన్నాడు.

లత కంగారుగా లోపలికి వెళ్లి గ్లాసులో మజ్జిగ పట్టుకొచ్చి ఇచ్చింది.

"ఇక్కడ వెంకటేశ్వర స్వామి టెంపుల్ చాలా బాగుంటుందట కదా! వెళదాం!" స్నానం చేసి వచ్చాక అన్నాడు అశోక్.

వెంటనే శర్వానందం జీన్స్, టీ షర్ట్ వేసుకుని తయారయ్యాడు. గదిలోంచి తయారై వచ్చిన అశోక్ ని చూసి అవాక్కయ్యాడు.

చక్కగా పంచె కట్టుకుని పైన లాల్చీ వేసుకుని భుజం మీద ఓ కండువా వేసుకుని అచ్చమైన తెలుగింటి పెద్ద మనిషిలా తయారయ్యాడు అశోక్.

"ఆలయానికి వెళ్ళేప్పుడు ఇలాంటి పిచ్చి బట్టలు వేసుకున్నావేం?" అన్నాడు శర్వానందం వైపు వింతగా చూస్తూ!



శర్వానందం ఏం చెప్పాలో తెలీక ఓ వెర్రి నవ్వు నవ్వి బైల్దేరాడు.

"రాత్రి భోజనంలోకి వెజిటబుల్ బర్గర్, పాస్తాతో పాటు పిజ్జా..." అని శర్వానందం అంటుండగానే... "కాస్త పప్పు వండించి ఉల్లి కారం దట్టించిన గుత్తి వంకాయకూర, రసం చేయించలేవా?" అన్నాడు అశోక్.

"అలాగే తప్పకుండా.." అని చెప్పి, లతకు ఫోన్ చేసి "రాత్రి మెనూ మనం అనుకున్నది కేన్సిల్" అని చెప్పి ఏం వండాలో చెప్పాడు.

ఇంటికి వచ్చేసరికి గదిలో నుంచి చెవులు హోరుమనేలా మ్యూజిక్ వినిపిస్తోంది.

"మా అబ్బాయి... ఎనిమిది చదువు తున్నాడు. పాప్ మ్యూజిక్ అంటే చెవి కోసు కుంటాడు." నవ్వుతూ చెప్పాడు శర్వానందం.

"ఇంట్లో భగవద్గీత వుందా?" అడిగాడు అశోక్.


"భలేవాడివే... ఇంగ్లీష్ నవల్లు తప్ప ఇంకేం చదవను నేను. మనింట్లో అవే ఉంటాయ్!" గర్వంగా చెప్పాడు.


"అలాగా" అన్నాడు అశోక్.


ఆ మర్నాడు ఉదయం అశోక్ బయల్దేరుతూ "చూడు శర్వా! అమెరికాలో మా ఏరియా తెలుగు వాళ్ళందరం కలిసి ఒక స్కూల్ స్థాపించుకున్నాం. దాంట్లో చదివే పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియాలనీ, తెలుగు భాష, రుచులు, అభిరుచులు, అలవాట్ల గురించి వారికి పూర్తిగా పరిచయం వుండాలనీ చెప్పి ఇక్కణ్ణుంచి ఎవర్నైనా తీసుకెళ్ళి ఆ పని కోసం అక్కడ అపాయింట్ చేద్దామనుకున్నాం. వసతి, భోజనం, మంచి శాలరీ ఇచ్చి కేర్ టేకర్‌గా ఉంచుదాం అనుకున్నాం. కానీ నువ్వు ఆ ఉద్యోగానికి తగవని నాకర్థమైంది. ఎందుకంటే నువ్వు ఇక్కడే వున్నా విదేశీ సంస్కృతిని ఆవాహన చేసుకుని అలాగే ప్రవర్తిస్తున్నావు. నీకంటే నేనే నయం! ప్రవాసం వెళ్ళినా ఇంకా ఆంధ్రుడిగానే వున్నాను! అంచేత నీకు అవకాశం ఇవ్వలేను... సారీ!!" అని శర్వానందానికి చెప్పి వెళ్ళిపోయాడు.

తన అతి తెలివితేటలతో అమెరికాలో ఉద్యోగాన్ని పోగొట్టుకున్న శర్వానందం పిచ్చి చూపులు చూస్తూ వుండిపోయాడు!

## దసరా వేషాలు





శ్రీ కొయిలాడ వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం ప్రవాసాంధ్రులు అంశంతో నిర్వహించిన మినీ హాస్య కథల పోటీలో **ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# నామకరణం

కొమ్ముల వెంకట సూర్యనారాయణ
9949602721

**"మీరందరూ జూమ్ మీటింగ్‌కి హాజరవ్వాలిరా... మావాడు అమెరికాలో ఉన్నాడు కదా! ఎంత అమెరికాలో ఉన్నా మన ఊరన్నా... మన వాళ్ళన్నా పిచ్చ అభిమానం వాడికి! అలాగే మన తెలుగన్నా చెవికోసుకుంటాడు. వాడికి ఈ మధ్యనే అమ్మాయి పుట్టిందిరా... దానికి నామకరణోత్సవం చేయిస్తున్నాను..."**

ఇక్కడికి ఎలాగూ రాలేరు కదా, కనీసం జూమ్ లో చూద్దురుగానీ అందరినీ జూమ్ మీటింగ్ కి హాజరవ్వమనండి" అని ఫోన్ చేసి ఆ మీటింగ్ లింక్ పంపాడురా, అది మీ అందరికీ పెడుతున్నా, అందరూ హాజరు కావాలి" అని బంధుమిత్రులందరికీ ఫోన్ చేసి చెప్పాడు భగీరథుడు, పిల్లా పీచుతో సహా విడిచిపెట్టకుండా.

జూమ్ మీటింగ్ ప్రారంభమైంది.

కళ్ళువిప్పార్చి చూస్తున్నారు భగీరథుడు తో సహా బంధుమిత్రులందరూ.

"మీరెన్నైనా చెప్పండి మన అమ్మాయికి మా నాన్న గంగయ్య పేరు వచ్చేలా గంగ అని పెట్టి తీరవలసిందే" అంది భగీరథుడి కోడలు రాణి తన భర్త రాజుతో జూమ్‌లో.

"లేదు! లేదు... మా నాన్న పేరు భగీరథుడు... ఆ పేరు వచ్చేలా భాగీరథి అని పెట్టి తీరాల్సిందే" అన్నాడు రాజు తన భార్య రాణితో.

మీసం మెలేసి చూస్తున్నాడు భగీరదుడు,తన కొడుకు తన పేరే వచ్చేలా పెట్టమన్నందుకు.

"ఇలా కాదుగానీ, ఆ రెండు పేర్లు కలిసొచ్చేలా గంగాభాగీరథి అని పెడదామండి" అంది.

"సరే" అని ఆనందంగా తలూపాడు రాజు.


బిక్కమొహం వేసి చూసాడు భగీరథుడు.

అందరూ నవ్వుతూ కనిపించారు జూమ్‌లో.

వెంటనే భగీరథుడు అందుకుని–

"నీ మొహం మండ! అసలు గంగాభాగీరథి అంటే అర్థం తెలుసురా? భర్త పోయిన ఆవిడని గంగా భాగీరథీ అంటారురా త్రాష్టుడా! వెంటనే ఆ పేరు మార్చు!" అన్నాడు కొడుకుతో జూమ్‌లో.

'సరే! ఒక పని చేద్దాం... జ్యేష్ట నక్షత్రంలో పుట్టింది కదా! అందుకే జ్యేష్ట అని పెడదాం!" అన్నాడు రాజు



"ఛీ! జ్యేష్ట ఒక్కటే ఏంబాగుంటుంది, మా అమ్మ పేరు దేవి అండి, నేను ముందే మా అమ్మకి మాటిచ్చేసాను ఆడపిల్ల పుడితే తన పేరే పెడతానని... అందుకే మీ మాట తీసేయకుండా, నా మాట తీసేయ కుండా జ్యేష్టాదేవి అని పెడదామండి!" అంది రాణి.

ఆనందంగా మరోసారి తలూపాడు రాజు.

మళ్ళా పుసుక్కున నవ్వారు జూమ్ మీటింగ్ లో ఉన్నవాళ్ళందరూ.

"చూసారా! నాన్నా! ఈ పేరు ఎంత బాగా నచ్చేసిందో అందరికీ, అందరూ ఒకటే ఆనందంతో నవ్వుతున్నారు అన్నాడు రాజు.

"నీ శ్రాద్ధం రా! జ్యేష్టాదేవి అంటే అర్థం ఏమైనా అర్థమై ఏడిసిందా? జ్యేష్టాదేవి అంటే దరిద్ర దేవతరా, తగలడు... అది కూడా మార్చి తగలడు!!" అన్నాడు రాజు నాన్న.

ధబేలున కుప్పకూలిపోయాడు రాజు.

ఇంక ఎటువంటి పేర్లు వినాల్సివస్తుందో అని భగీరథుడు–

"అందరూ లీవ్ అవ్వండిరా! పేరు పెట్టిన తరువాత నేను తెలియ చేస్తానులే మీ కందరికీ!" అని ఓ గావుకేకవేసి జూమ్ మీటింగ్ నుంచి లెఫ్ట్ అయిపోయాడు.

## 'పకోడి పొట్లం' కార్డు కథల పుస్తకావిష్కరణ



**ఆర్పీ** కృష్ణ స్వామి రాజు రచించిన 'పకోడి పొట్లం' కార్డు కథల సంపుటి ఆగష్టు 29 న చిత్తూరు జిల్లా పుత్తూరులో ఆవిష్కరింపబడింది. చిత్రంలో ఎడమ నుంచి కుడికి, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు శ్రీ ఏ.మల్లేశ్వర రావు, శ్రీ కవి రొద్ద సురేంద్ర, పిచ్చాటూరు తహశీల్దార్ శ్రీ టి.వి.సుబ్రమణ్యం, అద్దంకి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర్, రచయిత శ్రీ ఆర్పీ కృష్ణ స్వామి రాజు, వేదవ్యాస విద్యా సంస్థల కరెస్పాండెంట్ శ్రీమతి సి.బాల సరస్వతిలు ఉన్నారు.

## డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి)ఆశీస్సులతో గుడిబండి వెంకట రెడ్డి, హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్టూన్ పోటీలు



శ్రీ గుడిబండి వెంకట రెడ్డి గారు కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతోఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్టూనిస్టు మిత్రులు అందరూ పాల్గొవాలని మా మనవి

| | |
|---|---|
| **మొదటి బహుమతి** | -రూ.3000/-లు + మెమొంటో + సర్టిఫికెట్ |
| **రెండవ బహుమతి** | -రూ.2000/-లు + మెమొంటో + సర్టిఫికెట్ |
| **5 ప్రత్యేక బహుమతులు** | -రూ.1000/-లు ఒక్కొక్కరికి + మెమొంటో+ సర్టిఫికెట్ |

అంశం ఏదయినా అవచ్చు.

బహుమతుల ప్రదానోత్సవ సభ జనవరి 2022 లో హైదరాబాదులో జరుగుతుంది.

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: నవంబర్, 15, 2021

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-hasyanandampoteelu@gmail.com

వివరాలకు : 9849630637, 9849882783

# తర్కారావు కథలు



గంగాధర్ వడ్లమన్నాటి-9908445969

## తొందరపాటు కోటేశ్వర్రావ్

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**



**త**ర్కారావ్ ఓ దగ్గు దగ్గి... కాస్త గొంతు సవరించుకుని-

“ఓసారి కోటేశ్వరరావుగారి కార్‌కి కోతి అడ్డురావడంతో, కోతిని తప్పించి, బ్రేక్ తొక్కి హమ్మయ్య అనుకున్నాడు పళ్ళికిలిస్తూ...

కానీ అతను బ్రేక్ తొక్కబోయి క్లచ్ తొక్కే సాడని గ్రహించేలోపే కారు చెట్టుకి గుద్దే యడం జరిగింది.

తర్వాత కొందరు చుట్టూ మూగి, యాక్సి డెంట్ ఎలా జరిగింది? కారు ఎంతలా డామేజీ అయింది? చెట్టు బతుకుతుందా లేక మనిషి బతుకుతాడా? అని చాలా మంది మాట్లాడుకో సాగారు.

ఇంతలో ఒకతను, దగ్గరలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి ఫోన్ చేశాడు.

చాలా డబ్బు ఖర్చు చేశాక... అతనికి ప్రాణా పాయం తప్పిందని డాక్టర్లు చెప్పడంతో అతని భార్య ‘హమ్మయ్య’ అని ఊపిరి పీల్చుకుంది.

అయితే, అతను కళ్ళు తెరిచాక, ఆమెకి ఊపిరి పోయినంత పనైంది. కారణం, అతని చూపు పోవడమే.

అయితే, కోటేశ్వరరావు అసలే మహా తొందరపాటు మనిషి. నెగెటివ్ థింకర్ కూడా. ఇప్పుడు చూపు పోవడంతో, ఒక్కసారే బిక్కచచ్చి పోయి, చచ్చుమొహం పెట్టుకుని మౌనంగా ఉండేవాడు.

ఆ హాస్పిటల్ నుండి డిశ్చార్జీ అయింతర్వాత, ఇంట్లో కూడా ఇదే తంతు. దాంతో అతని భార్య, అతని చూపు పోవడంతోనే, అతనిలో పూర్వం ఉన్న ఊపు కూడా పోయిందని అర్థం చేసుకుంది.

దాంతో చాలా మంది కంటి వైద్యులను... చాలా కంటి ఆసుపత్రులను సంప్రదించగా, ఓ కంటి డాక్టర్‌గారు సర్జరీ చేసి చూద్దాం... పోయేదేముంది?” అని పైకి అని ‘డబ్బు తప్ప’ అని మనసులో అనుకున్నాడాయన.

అతని మాటలు విన్నాక, ఆమె సంతోషం ఇంతా అంతా కాదు. ముంతంత మొహం చేసుకుని మరీ సంతోష పడింది.

కానీ కోటేశ్వరరావు మాత్రం చేదు మాత్ర నోట్లో ఉన్నట్టు మొహం పెట్టి... ఆపరేషన్ తర్వాత చూపు రాకపోతే, విషం తాగి చని పోతానన్నాడు.

ఆమె, ఓపికగా ఉండమని, అంతా మంచే జరుగుతుంది అని నచ్చ చెప్పింది.

తరువాత, ఆపరేషన్ వందశాతం సక్సెస్ అయింది. కానీ అతను, కుట్లు విప్పాక విషం తాగాడు. ఇప్పుడు చెప్పు!... ఆపరేషన్ వంద శాతం సక్సెస్ అయింది కదా! మరతను విష మెందుకు మింగాడు?” అడిగాడు తర్కారావ్.


సుబ్బారావ్ తల గోక్కుని, ఏదో తట్టినట్టు ఒక్కసారే ఉత్సాహంగా, “ఆc! అర్థమైంది సార్! అతనికి ఆపరేషన్ సక్సెస్ అయినా, అతనికి చూపు రాలేదేమో! అంతేనా సార్!!” అడిగాడు నమ్మకంగా.

“కాదు! తమరి బొంద!! అతనికి కుట్లు విప్పినప్పుడే, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ కావడంతో ఆసుపత్రిలో పవర్ పోయింది. దాంతో కుట్లు విప్పి, విప్పగానే అంతా చీకటిగా అనిపించ డంతో, నిరుత్సాహంతో జేబులో దాచుకున్న విషం గటగటా తాగేసాడు... తర్వాత కొద్ది సేపటికి, జనరేటర్‌తో పవర్ రావడంతో, చూపు వచ్చిందనే విషయం అర్థమైంది. కానీ విషం అప్పటికే పనిచేసింది. దాంతో సగం స్పృహ పోయింది... విషం తాగి చావాలను కున్నది ఆసుపత్రిలో కనుక, పరిస్థితి అంతగా విషమించలేదు. దాంతో బతికి ఇంట్లో పడ్డాడు. అప్పటి నుండి తొందరపాటు తగ్గించుకుని, పాజిటివ్‌గా ఆలోచించడం అలవాటు చేసుకు న్నాడు. విషమ పరిస్థితులకి విషం కంటే వివేకం బాగా పనిచేస్తుందని గ్రహించాడు. అదీ అసలు సంగతి... నువ్వు కనీసం దగ్గరగా కూడా చెప్పలేకపోయావు కనుక... ఈసారి కూడా నీ జీతం పెంచడం జరగదు!” అని తర్కారావ్ చెప్పడంతో...

“మీ తర్కం మీదే కానీ, నా తరపు అర్థం చేసుకోరు కదా!” అనుకుంటూ, అక్కడినుండి కదిలాడు సుబ్బారావు.

# నికమ్మా

తోపల్లి ఆనంద్




నికమ్మా = చేతకాని దద్దమ్మ



శ్రీ కొయిలాడ వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం ప్రవాసాంధ్రులు అంశంతో నిర్వహించిన మినీ హాస్య కథల పోటీలో **ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# సుబ్బలక్ష్మి గర్భడాన్స్

బలభద్రపాత్రుని ఉదయ శంకర్,
9494536524

**ఆలస్యమైతే ముందు వరుస సీట్లు దొరకవని హడావుడి పడుతున్న సుందరానికి తాయారమ్మ నుంచి ఫోన్ రావటంతో చిరాకుపడి–**

**‘ఏంటి బామ్మా! అర్ధరాత్రి తప్ప, నీకు పగలు టైమే దొరకదా ఫోన్ చెయ్యటానికి?” అన్నాడు.**

**తాయారమ్మ జవాబు చెప్పే లోపల సుబ్బలక్ష్మి భర్త చేతిలో నుంచి ఫోన్ లాక్కుని**

**“నాకు గర్భాడాన్స్ చూపించటానికి తీసుకెళ్తున్నారు మీ మనవడు... రేపు మాట్లాడుకుందాం అమ్మమ్మా!” అంది.**

కొన్నాళ్ళుగా వినికిడి శక్తి తగ్గిన తాయారమ్మ “ఎంత శుభవార్త చెప్పావే నా తల్లీ! అయినా అర్ధరాత్రి...” అని ముసలావిడ ఏదో చెప్ప బోతుంటే... పూర్తిగా వినకుండానే ఫోన్ పీక నొక్కేసింది సుబ్బలక్ష్మి.

బామ్మ తప్ప ఎవరూ లేని సుందరానికి గాంధీ నగర్లోని ఓ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

ఆర్నెల్ల క్రితం సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకుని కాపురం పెట్టిన సుందరానికి బామ్మ రోజూ ఫోన్ చేసి “ముని మనవణ్ణి ఎప్పుడు ఇస్తార్రా?” అంటూ వేధించసాగింది.

✦ ✦ ✦

తెల్లారు ఝామున నాలుగ్గంటల వరకు గర్బా డాన్స్ చూసి ఇంటికొచ్చి పడుకున్నారు సుందరం, సుబ్బలక్ష్మి.


ఒక గంటసేపు పడుకున్నారో లేదో అదే పనిగా ఫోన్ మోగుతుంటే విసుగ్గా లేచాడు సుందరం.


మళ్ళీ బామ్మ నుంచే ఫోన్!

“ఛీ! ఛీ!!... బంగారం లాంటి నిద్రంతా పాడు చేసింది” అని తిట్టుకుంటూ, పెళ్ళాన్ని లేపి–

“నువ్వే ఏదొకటి మాట్లాడు. లేదంటే ఫోన్లు చేసి చంపుతూనే ఉంటుంది...” అని మళ్ళీ దుప్పట్లో దూరాడు.

సుబ్బలక్ష్మి బద్ధకంగా ఆవలిస్తూ – “అబ్బా!...






నాకు వికారంగా ఉందండీ" అని తప్పదన్నట్లు ఫోన్ తీసుకుని– "రాత్రి ప్రవాస ఆంధ్రులు ఏర్పాటు చేసిన గర్బాడాన్స్ చూసి ఇంటికి వచ్చేసరికి ఆలస్యమైంది. ఇవాళ ఆదివారమే కదా...మధ్యాహ్నం మేమే నీకు ఫోన్ చేస్తాంలే!" అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

అవతల ముసలావిడ ఆనందానికి అవధులు లేవు.

చుట్టుపక్కల వాళ్ళందర్నీ పిలిచి హడావుడి చేసింది.

"పాపం! పిల్లలు ఎంత కష్టపడుతున్నారో ఏమిటో! నేను వెంటనే బయల్దేరాలి. నన్నెవరన్నా రైలెక్కించడర్రా!" అంటూ బతిమాలింది.

పక్కింటి వాళ్ళ అబ్బాయి తాయారమ్మని అహ్మదాబాద్ రైలెక్కించాడు.

రైల్లో పరిచయం అయిన ఒక తెలుగు కుటుంబం సాయంతో తాయారమ్మ మనవడి ఇంటికి క్షేమంగా చేరింది.

ఉరుము లేని పిడుగులా ఊడి పడ్డ బామ్మని చూసి కొత్త దంపతులు అవాక్కయ్యారు.


తాయారమ్మ నేరుగా సుబ్బలక్ష్మి దగ్గరకు వెళ్ళి– "ఇక నుంచి నువ్వు ఏ పనీ చేయద్దు. ఇంటి పనంతా నేను చూసుకుంటాను... ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో!..." అంది తల నిమురుతూ.

సుందరానికి బామ్మ మాటలు అర్థం కాలేదు.

సుబ్బలక్ష్మి మాత్రం తాను ఫోన్లో మాట్లాడిన మాటలు చెవిటి బామ్మకి ఎలా అర్థం అయ్యాయో గ్రహించి పగలబడి నవ్వసాగింది.

పెళ్ళాం నవ్వుతుంటే సుందరానికి వళ్ళు మండింది.

"అసలేం జరిగిందో చెప్పి, ఆ తర్వాత నవ్వి చావు" అన్నాడు.




ఆమె నవ్వుతూనే భర్తకి చెవిలో విషయం చెప్పింది.

సుందరానికి నవ్వాలో, ఏడవాలో తెలియక పిచ్చి చూపులు చూడసాగాడు.

సుబ్బలక్ష్మి నవ్వినవ్వి కడుపులో నొప్పితో పొట్ట చేత్తో పట్టుకుంటే "అర్జెంటుగా ఆటో పిలవరా! అమ్మాయిని ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. అయినా అప్పుడే నొప్పులేంటి కలికాలం కాకపోతే!" అంది బామ్మ కంగారుపడుతూ.

ఇక లాభం లేదని సుబ్బలక్ష్మి బలవంతంగా నవ్వుని ఆపుకుని– "అయ్యో అమ్మమ్మా! నేను ఫోన్లో చెప్పింది 'గర్బా డాన్స్' గురించి. నాకు గర్భం రాలేదు!!" అంది.

బామ్మ విడ్డూరంగా చూసి– "గర్బా డాన్సా? అంటే అది గర్భవతులు చేస్తారా?" అనడిగింది.

సుబ్బలక్ష్మి నవ్వి చీర చెంగు బొడ్లో దోపి తాయారమ్మ చుట్టూ తిరుగుతూ గర్బాడాన్స్ చేసి చూపించింది.

ముసలావిడకి ఇంకా నమ్మకం కలగలేదు.

"మరి ప్రసవం ఏర్పాట్లు చేశారన్నారు?" అంది.

సుందరం బామ్మ వంక జాలిగా చూసి "సుబ్బలక్ష్మి నీతో 'ప్రవాస ఆంధ్రులు ఏర్పాటు చేశారు' అని చెప్పింది. నీకు ప్రసవం అని వినిపించినట్లుంది... నా కర్మ!" అన్నాడు నీరసంగా.

పళ్ళు పటపటా కొరుకుతున్న మొగుడుని చూసి సుబ్బలక్ష్మి పడిపడీ నవ్వుతుంటే...

తాయారమ్మ "ఆ!.." అంటూ పడిపోయింది.



శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన
కథ

# ఎంత బాగుంటుంది!

జి.రంగబాబు,
9440190669

**నేనిలా నిద్ర లేచానో లేదో... తేనె వంటి తియ్యని మాటలు నా చెవిన పడ్డాయి.**

**నా ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది.**

**అవేమిటంటే– "నాన్నా!... ఇదిగో తేనీరు...సేవించండి!" మా అబ్బాయి నా మంచం ప్రక్కన నిలబడి అడుగుతున్నాడు టీ కప్పు చేతితో పట్టుకుని.**

**మా అమ్మాయి అయితే మరీనూ... వాళ్ళ మమ్మీతో– "అమ్మా శుభోదయం! నన్ను వెంటనే ముస్తాబు చెయ్యి... పాఠశాలకు వెళ్ళాలి!" అంటోంది.**

ఒక్కసారి నా మత్తు అంతా దిగిపోయింది.

'నేను అమెరికాలోనే ఉన్నానా?...లేక అనకాపల్లి వచ్చేశానా?' అన్న అనుమానం కలుగుతోంది.


అమెరికా వచ్చిన దగ్గరనుండీ పిల్లలు ఒక్క తెలుగు మాట మాట్లాడితే ఒట్టు. అలాంటిది ఈ రోజు వాళ్లకేమైంది?... దయ్యం గానీ పట్ట లేదు కదా! అని ఆశ్చర్య పోతుంటే నా శ్రీమతిది కూడా అదే పరిస్థితి. మా ఆశ్చర్యం చూసి మా పిల్లలిద్దరూ పక పకా నవ్వారు.

వారి నవ్వు చూసి మళ్లీ నేనే అన్నాను.

"మీకేం పిచ్చి పట్టలేదు కదా! ఏమిటీ వింత చేష్టలు? ఏమిటీ పిచ్చి మాటలు?" అన్నాను.

"మీరలా ఆశ్చర్యపోతారని తెలుసు... మేమిలా ప్రవర్తించడానికి కారణం ఉంది. ఈ రోజు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం... అందుకని ప్రతి ఒక్కరూ వారి వారి మాతృభాష లోనే మాట్లాడాలి తప్పితే అన్య భాషా పదాలు వాడకూడదు. అందుకనే మీతో ఇలా తెలుగులోనే మాట్లాడుతున్నాం... మన మాతృభాషా పిలుపులే పిలుస్తున్నాం!"

'ఆహా... ఎంత సుదినం! ఎన్నాళ్ళయింది ఈ పిలుపులు విని... చెవుల్లో అమృతం పోసినట్లుగా ఉంది... అమెరికా వచ్చాక తెలుగులో మాట్లాడు కోవడమే గగనం అయిపోయింది... మళ్లీ ఇన్నాళ్ళకి..." అనుకుని–



"అయితే ఈరోజు మనం పండగ చేసుకో వలసిందే... ఆంధ్రుల పిండివంటలు చేసుకుందాం!... సరదాగా గడుపుదాం." అన్నాను.

అందరూ సరే అన్నారు.

ఆ రోజు మన తెలుగు వారి వంటలకు ప్రసిద్ధిగాంచిన పులిహోర, నేతి బొబ్బట్లు, మినప గారెలు, గోంగూర పచ్చడి, పాయసం చేసుకుని తనివితీరా తిన్నాం.

ఆరోజు అందరం ఒక్క ఆంగ్ల పదమైనా వాడకుండా తెలుగులోనే మాట్లాడుకుంటూ తేనె కన్నా తియ్యనైన మన తెలుగుభాషలోని మాధుర్యాన్ని తనివితీరా అనుభవించాము.

వేమన శతకం, సుమతీ శతకంలోని పద్యాలను, భాగవతం లోని పద్యాలను, తిరుపతి వేంకటకవులు రచించిన పాండవో ద్యోగ విజయాలలోని పద్యాలను వినిపించాను.

విని ఆనందించారు.

"భలేగున్నాయ్ నాన్నారూ... పద్యాలు!" అంటూ చప్పట్లు కొట్టారు.

ఆ రోజంతా హాయిగా గడిచింది.

ఆరోజు గడిపిన మధుర క్షణాలను తలుచుకుంటూ నిద్రపోయాం.

రోజు మారింది...

నేను లేచేసరికి పిల్లల కేకలు...పెద్దగా అరుస్తూ....

"మామ్! వేరీజ్ మై సాక్స్? గెటింగ్ లేట్ టు మై స్కూల్!" అంటూ మావాడు వాళ్ళ అమ్మ మీద అరుస్తున్నాడు.

"మామ్...వేరీజ్ మై లంచ్ బాక్స్! గెట్ ఇట్ అర్జెంట్! ఐ హేవ్ టు అటెండ్ స్కూల్ హాఫ్ ఏన్ అవర్ బిఫోర్!" మా అమ్మాయి అరు స్తోంది.

కర్ణ కఠోరంగా వినిపిస్తున్నాయి ఆ మాటలూ... ఆ పిలుపులూ!

చెవుల్లో సీసం కరిగించి పోసినట్లుంది.

ముందు రోజు ఎంతో హాయిగా పలికిన నోటితోనే ఈ రోజు ఘోరంగా పలుకుతున్నారు.

నిన్న ఒక్క రోజేనట మాతృ భాషలో మాట్లాడుకోవడం... ఈ రోజు నుండీ మళ్ళీ మామూలే!


మనసంతా ఏదో చేదు తిన్నట్లు అయిపోయింది...


సంవత్సరం అంతా ఇలాగే మాట్లాడుకోండి అంటే ఎంత బాగుంటుంది.


నిజమే! నిన్న మాతృభాషా దినోత్సవం కాబట్టి అలా మాట్లాడారు. కానీ ఈరోజు కాదుగా! సంవత్సరం అంతా మళ్లీ ఈ పరభాషా పిలుపులే వినాలి... ఇదే మాట్లాడాలి!

మేం ఈ రోజు నుండే ఎదురు చూస్తున్నాం... మళ్లీ సంవత్సరం తరవాత వచ్చే మాతృభాషా దినం కోసం!

# దసరా వేషాలు





శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
**ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# ఏగానీ గుంటకి...

ద్విభాష్యం రాజేశ్వర రావు,
9440318415

**ఇది 1970 ల నాటి ముచ్చట! అప్పట్లో నేను 'యుఎస్' లోని డల్లాస్ నగరంలో 'కెల్లాగ్స్' కంపెనీలో పనిచేసేవాణ్ణి.**

**రాబోయే న్యూఇయర్ రోజున మా ఆవిడకి 'సర్‌ప్రైజ్ గిఫ్ట్' ఏదైనా ఇద్దామని ఆలోచించి, డిసెంబరు ఇరవయ్యో తేదీన మా అపార్ట్‌మెంట్ దగ్గరలో ఉన్న 'బెన్సన్ అండ్ బెన్సన్' డిపార్ట్‌మెంటల్ స్టోర్‌కి వెళ్లి 'డిస్కౌంట్ ఆఫర్'లో ఆరు డాలర్లకు ఓ 'ఎలక్ట్రిక్ మినీ గ్రైండర్' కొన్నాను.**

జనవరి ఒకటో తేదీ ఉదయం 'హ్యాపీ న్యూ ఇయర్ చెబుతూ, ప్యాకింగ్ ఇప్పి మా ఆవిడకి దాన్ని ప్రెజెంట్ చేసాను.

ఆ గ్రైండర్ చూసి మా శ్రీమతి ఎంతో ముచ్చట పడింది. అంత చవకగా ఆరు డాలర్లకే నేను దాన్ని చేజిక్కించుకోగలిగినందుకు నన్ను ఎంతో అభినందించింది. త్వరలో వచ్చే మన కనుమ పండుగనాడు గారెలు చేయటానికి అల్లం, పచ్చి మిర్చి ముద్ద అందులో గ్రైండ్ చేయటం ద్వారా దానికి ప్రారంభోత్సవం చేయాలని సంకల్పించింది.

కనుమపండుగ నాడు దానికి పసుపు బొట్టు పెట్టి, ఓ కొబ్బరికాయ దాని దగ్గర పగలగొట్టి ఆ తీర్థంతో గ్రైండర్‌ను అభిషేకించి, స్విచ్ ఆన్ చేసింది.

మోటారు శబ్దం వస్తోంది కానీ లోపల బ్లేడు తిరగటంలేదు.

ఎన్నిసార్లు ప్రయత్నించినా... అంతే!

ఇక లాభం లేదని వెంటనే దాన్ని శుభ్రంగా గుడ్డతో తుడిచి మళ్లీ జాగ్రత్తగా ప్యాకింగ్ చేసి పట్టుకుని ఆ స్టోర్‌కి వెళ్లాను.


"ఈ గ్రైండర్ పని చేయటంలేదు" అంటూ వారి దగ్గర కొన్నట్లు కేష్ బిల్లు చూపించాను.

'ఇది కొన్నప్పుడు దీనితో ఇచ్చిన వారెంటీ కార్డు నింపి ఇచ్చారా?" అంటూ అడిగాడు ఆ షాపు ఓనర్.

"మీ దగ్గర డిసెంబరు ఇరవైన కొన్నాను కదా! న్యూ ఇయర్ నాడు ప్యాకింగ్ విప్పి మా ఆవిడకి ప్రెజెంట్ చేసాను. ఆ రోజు మధ్యాహ్నామే వారంటీ కార్డు నింపి మీ స్టోర్ బాక్సులో పడేసాను" అన్నాను.

"కొన్న ఇరవై నాలుగ్గంటలు లోగా పడెయ్యమని దానిమీద రాసి వుంటుంది. అలా చేయకపోతే మీ గ్రైండర్‌కి వారంటీ వర్తించదు!"అన్నాడు.

'బెన్సన్ అండ్ బెన్సన్' ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డిపార్టుమెంటల్ స్టోర్స్ కదా...కేవలం ఆరు డాలర్ల విలువ చేసే ఈ మిక్సీ దగ్గర మీరు



అలా అనడం బాగాలేదు!" అన్నాను కొంత నిష్ఠూరంగా.

"సారీ! మేము ఏమీ చేయలేం!" అన్నాడు.

ఇక లాభం లేదని, "ఈ విషయం మీద నేను మీ హెడ్డాఫీసుకి కంప్లయింట్ ఇస్తాను!" అంటూ చిన్నగా బెదిరింపుకు దిగాను.

"ఇవ్వండి! కానీ బెన్సన్ అండ్ బెన్సన్ కంపెనీ ఇప్పుడు లేదు... పదిరోజుల క్రితం 'బిల్లింగ్ నార్త్' కంపెనీలో 'మెర్జ్' అయి పోయింది... ఇంక వారం రోజుల్లో 'బిల్లింగ్ నార్త్' కంపెనీలో అరవై శాతం షేర్లను 'కింగ్స్ టన్ వాటర్ కూపర్స్' కంపెనీ కైవసం చేసుకోబోతోంది." అన్నాడు.

ఇక నేను చేయగలిగింది ఏమీ లేదని తెలిపోయింది. మరో ఆరు డాలర్లు పెట్టి గ్రైండర్ కొందాం! అనే నిర్ణయానికి వచ్చి–

"సరే! కొత్త గ్రైండర్ ఇవ్వండి. నేను ఆరు డాలర్లు పే చేస్తాను!" అన్నాను.

"మా దగ్గర కొత్త గ్రైండర్లు లేవు! మేము ఆ కంపెనీ ఏజెన్సీ కేన్సిల్ చేసుకున్నాం. ఈ గ్రైండర్ కొన్నవాళ్ళు, కొన్న మర్నాడే 'ఇది పని చేయడం లేదు' అంటూ మా షాపుకి క్యూ కడుతున్నారు... ఈ వారంలో మీది ముప్ఫయ్ రెండో కేసు అందుకని మేం వాటిని అమ్మడం మానేసాం!" అన్నాడు.

"మరి, ఈ గ్రైండరు ఏం చేయమంటారు?" అంటూ ఆందోళనగా అడిగాను.

"దీనికి ఒక మార్గం ఉంది! పది డాలర్లు 'ఏన్యువల్ మెయింటెనెన్స్ ఛార్జెస్' కడితే ఓ సంవత్సరం వరకూ ఎప్పుడు ప్రాబ్లం వచ్చినా మేం ఫ్రీగా రిపేరు చేసి ఇస్తాం. అందువలన పది డాలర్లు కట్టి ఆ గ్రైండర్ మాకు ఇచ్చి వెళ్ళండి. రేపు సాయంకాలానికి రిపేరు చేసి రెడీగా వుంచుతాం!" అన్నాడు నావంక నిశితంగా చూస్తూ.

అంతకంటే చేసేదేం లేక వాళ్ళకి గ్రైండర్‌తో పాటు పది డార్లు చెల్లించుకుని, ఇంటికి వచ్చి జరిగినదంతా మా ఆవిడతో చెప్పాను.


ఆవిడ నా వంక నిరసనగా చూసూ–


"ఏగానీ గుంటకి డబ్బున్నర క్షవరం అంటే ఇదే!" అంటూ తన శ్రీకాకుళం మాండవికంలో గొణుక్కుంది.


'ఏగానీ లేదా ఏగాణీ' అనేది పాతరోజుల నాణెం. కాణీ కంటె కూడా విలువ తక్కువది. గుంట, గుంటడు అనేవి ఉత్తరాంధ్రలో మగపిల్లవాడు, ఆడపిల్లలకు వాడే పదాలు.

నిజానికి ఒరిజనల్ సామెత: 'ఏగానీ ముండకి డబ్బున్నర క్షవరం!' అని.

## ముచ్చటగా మూడు...





# మాటల్లేవ్! నవ్వులే!!


మన కార్టూనిస్టులు క్యాప్షన్‌లెస్ కార్టూన్లలో కూడా సిద్ధహస్తులు కావాలనే ఉద్దేశంతో ప్రతినెలా 6 క్యాప్షన్‌లెస్ కార్టూన్లకు 200 రూపాయలు చొప్పున బహుమతులు! ఇది పోటీ కాదు! ప్రోత్సాహకం మాత్రమే!!





శ్రీ తోట జగన్నాథరావు, సరోజినీ స్మారకంగా, కార్టూనిస్టు శ్రీ టి.ఆర్.బాబు 3 కార్టూన్లకు & శ్రీ నాగిశెట్టి 3 కార్టూన్లకు ఈ బహుమతులు ఇస్తున్నారు.


నిర్వహణ: **నాగిశెట్టి**

## బహుమతి పొందిన కార్టూన్

























మీ కార్టూన్లు ఈ మెయిల్‌కి ప్రతినెలా 15వ తేదీలోగా పంపండి quitefun.hasyanandam@gmail.com

విశాఖ నగరం, బిర్లా జంక్షన్ దరి లక్ష్మీనివాసం గేటెడ్ కమ్యూనిటీ కాంప్లెక్స్‌లో **నార్త్ కోస్తాంధ్ర కార్టూనిస్ట్స్ ఫోరమ్ ( ఎన్.సి.సి.ఎఫ్)** ఆధ్వర్యంలో **'శతాధిక వ్యంగ్యచిత్రాల ప్రదర్శన'** జరిగింది. ఎన్ సి సి ఎఫ్ సభ్యుడు కార్టూనిస్ట్ టి.ఆర్.బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖకు చెందిన తెలుగు కార్టూనిస్టుల చక్కని కార్టూన్లు వందకు పైగా ప్రదర్శించారు. లక్ష్మీ నివాసం గేటెడ్ కమ్యూనిటీ చిన్నారుల కార్టూన్‌లు ప్రదర్శనలో ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశాపట్టణానికి చెందిన కార్టూనిస్టుల కార్టూన్‌లు ప్రదర్శించబడ్డాయి.





శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన
కథ

# అదో ప్రపంచం...

ఎం.హనుమంతరావు,
9949340236

**ఫోన్ మోగింది... ఆస్టిన్, టెక్సస్ నుంచి ప్రతిమ– "హాయ్... బాబాయ్!" అంటూ! విశాఖపట్నంలో ఫోను ఎత్తిన విశ్వనాథ్‌కు గుండెల్లో రాయి. టైం చూసాడు. ఆరున్నర! యస్వీబీసీ ఛానల్లో భగవద్గీత ఉపన్యాసం పట్టుగా సాగుతున్నది. విశ్వనాథ్ చూసే టీవీ ప్రోగ్రాం అదొక్కటే. కాసేపు ఏమన్నా కాపుగాస్తారేమో అంటే... భార్య, కోడలూ కూడా ఇంట్లో లేరు. పార్క్‌లో వాకింగ్‌కు వెళ్లారు.**

అంటే ఆ రోజుకు గీత అనే గీత లేనట్టే.

అటు చూద్దామంటే ప్రతిమ. అన్న కూతురైనా, కన్న కూతురంత ఆప్యాయంగా ఉండే బంగారు కొండ. అంత దూరం నుంచి ఆపేక్షగా ఫోన్ చేస్తున్నది... ఒక్కటే ఇబ్బంది!...అనువు గాని వేళ అరగంటన్నా మాట్లాడకపోతే ఇద్దరికీ తృప్తిగా ఉండదు. పోనీ కొంచెం ఆగి ఫోన్ చెయ మందామా అంటే, తను బిజీ అయిపోతుందేమో!

"ఏమ్మా బాగున్నావా?... మీ ఆయనా... పిల్లలూ..." పదిహేనేళ్ళ క్రితం అమెరికా వెళ్లిన ప్రతిమ అక్కడే ఒక పంజాబీ సహోద్యోగిని పెళ్ళి చేసుకుంది. ఇప్పుడు ఇద్దరు పిల్లలు.

"ఎవ్విరివన్ ఈజ్ ఫైన్ బాబాయ్! పిన్నీ, వదినా ఇంట్లో లేరా?"

ఆశాకిరణం!! లేదమ్మా, ఒక అరగంట ఆగి ఫోన్ చేస్తావా? వాళ్ళూ వస్తారు."

"అమ్మో!... ఈ రోజు ఊపిరాడనంత పని... యా! టైం లేదు. విశేషాలు నువ్వే చెప్పు!"

'జీవితంలో దుఃఖస్పర్శ లేని సుఖం వుండదు.' అంటున్నది టీవీ గీతాప్రవచనం. దానితో ఏకీభవిస్తూ దాని నోరు నొక్కేసాడు విశ్వనాథ్.

"ఊరికే ఫోన్ చేసాను! బిజీగా లేవు కదా కొంప దీసి?..." అడిగింది ప్రతిమ.


"నేనేం బిజీ? నీలా ఉద్యోగమా? సద్యోగమా?" అన్నాడు విశ్వనాథ్ దిగులుగా టీవీ వంక చూస్తూ.

చాలు ప్రతిమ మాట కచేరీ ప్రారంభించింది.

మంచి మాటకారి కాబట్టి, ఊకొట్టే వాళ్ళుంటే చాలు, నొప్పించకుండా, తానొవ్వకుండా ఎన్ని కబుర్లయినా చెప్తుంది. ప్రతిమ అంటే విశ్వనాథ్‌కు ఎలాగూ గారాబం కనక తను ఏం చెప్పినా ఆయనకు బాగానే ఉంటుంది.


మాటల మధ్యలో– "ఇప్పుడు పుస్తకాలు రాస్తున్నావా? అప్పుడెప్పుడో 'పరంపర' అనే పుస్తకం రాసావు కదా?" అంది.

"అవును. నీకు రెండు కాపీలు పంపేదా?" అన్నాడు విశ్వనాథ్ ఆత్రంగా.



"ఒద్దొద్దొద్దొద్దు!" అంది ప్రతిమ. వద్దంటే పోతుంది గదా, అన్ని 'ద్దొద్దొద్దొ'లు వాడటం అవసరమా అనుకున్నాడు విశ్వనాథ్. ఎవరి భయం వాళ్లది.

"క్రితంసారి వచ్చినప్పుడు నాకు మూడు కాపీలు యిచ్చావు. చదువుదామని ఒక కాపీ అమెరికా కూడా తెచ్చుకున్నాను. కానీ టైమేది బాబాయ్? నేను తెలుగు పుస్తకం అంటూ తెరిచి ఇరవై ఏళ్ళు దాటింది. నాకు నిద్రకు మిగిలే సమయమే ఆరుగంటలు. యా, సిక్స్ అవర్స్! ఏడుగంటలు పడుకుంటే లగ్జరీ! యా, మరిక అంతే! పెద్ద పెద్ద నవలలు ఎప్పుడు చదవాలి?"




నవల!? భారతీయ ఆధ్యాత్మిక వారసత్వం మీద తనెంతో శ్రమించి రాసిన ఉద్గ్రంథం కథో, నవలో, నాటకమో, మరొకటో కూడా ప్రతిమ గమనించలేదు! ఏం చదువులో వీళ్ళవి! మళ్లీ చూస్తే ఆ పిల్ల సైబర్ సెక్యూరిటీ గురించి పన్నెండు రీసెర్చ్ పేపర్లు రాసిన నిపుణురాలు! ఆమె జీవితం, ఆమె ప్రపంచం, ఆమె వాతావరణమే వేరు! ఏం చేస్తుంది? తనకు సైబర్ సెక్యూరిటీ అంటే స్పెల్లింగు కూడా తెలీదు కదా, అలాగే. అందుకే చిన్నబుచ్చుకోకుండా, "నిజమే!" అని అంగీకరించాడు విశ్వనాథ్.

"నువ్వు నీ నవల గురించి ఓ అరగంట మించకుండా మాట్లాడతానంటే మాత్రం చెప్పు బాబాయ్! ఇక్కడ నా తెలుగు స్నేహితురాళ్ళు నలుగురున్నారు. కాన్ఫరెన్స్ కాల్ సెటప్ చేద్దాం. వాళ్ళు దే ఆర్ క్రేజీ ఎబౌట్ తెలుగు నావెల్స్. యా! యండమూరి, జంధ్యాల, దేవులపల్లి, వగైరా వగైరా...యా!"

మళ్లీ 'నవల' అంటుంది! వద్దులేమ్మా!..." అన్నాడు బాబాయ్ శాంతంగా.

ఆమె కారణాలడగలేదు.

"అన్నట్టు, బాబాయ్! నువ్వు పిన్ని చేత, వదిన చేత ప్రతి ఏడూ వరలక్ష్మీవ్రతం చేయిస్తావటగదా? ఈ ఏడు, ఇరవయ్యో తారీకు వరలక్ష్మీవ్రతంట. నేనెప్పుడూ చెయ్యలేదు. నా చేత చేయించరాదూ? యా!"

విశ్వనాథ్ బదులిచ్చేముందే, మళ్లీ తనే...

"ఓ...సారీ, సారీ, సారీ! 20న నేను షికాగో వెళ్లాలి. కుదరదు. పోనీ ఒక బ్రిలియంట్ ఐడియా. 22న సండే. నేను ఫుల్లీ ఫ్రీ. యా, ఆ రోజు చేద్దామంటే చెప్పు. యా! అయాం గేమ్! ఎయిట్ టు నైన్ ఇన్ ది మార్నింగ్! ఐ గో విత్ దట్. యా చెప్పు!" అంది.

విశ్వనాథ్‌కి నవ్వొచ్చింది.

"అబ్బే, సండే ఎందుకమ్మా? క్లీనింగూ, వాషింగూ, కుకింగూ ఉంటాయి గదా! వచ్చే నెల వినాయకచవితి వస్తుంది. ఆ రోజు చేసుకో. రెండు పూజలూ ఒకేసారి అయిపోతాయి" అన్నాడు.


"ఆఁ! దట్స్ యీవెన్ బెటర్. అలా చేద్దాం. టూ బర్డ్స్ యిన్ వన్ షాట్... యా! గ్రేట్ బాబాయ్! దేవుడి పూజకు అన్ని రోజులూ మంచివేనని నా స్ట్రాంగ్ బిలీఫ్. వస్తువులేం కావాలో వాట్సాప్ చెయ్యి బాబాయ్. తెప్పిస్తాను" అని అకస్మాత్తుగా- "బాయ్, బాబాయ్!' అంది మంచి అంత్యప్రాసతోమరీ.

"సడన్‌గా ఏమయింది?" అడిగాడు విశ్వనాథ్ కొంచెం ఆందోళనగా.

"ఏంలేదు. మా కుక్క బుల్గానిన్ గాడితో వాక్ అయిపోయింది. ఇంటికి వచ్చేసాం. ఇక ఇప్పుడు మా పిల్లలతో పరుగు మొదలెట్టాలిక్కడ. బోలెడంత పని. 'కర్మణ్యేవాధికారస్తే'గా ఉన్నది ఇక్కడ నా పని!" అంటూ మళ్ళీ బై చెప్పి ప్రతిమ ఫోన్ పెట్టేసింది.

టీవీలో గీత అయిపోయి, దేవుడి నైవేద్యపు గంటలు వినిపిస్తున్నాయి.

అప్పుడే అత్తా కోడలూ తిరిగి రావడంతో అందరూ ఇక్కడి నైవేద్యం ఏర్పాట్ల కోసం డైనింగ్ టేబుల్ చుట్టూ చేరారు.





శ్రీ కొయిలాడ
వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం
ప్రవాసాంధ్రులు అంశంతో
నిర్వహించిన
మినీ హాస్య కథల పోటీలో
**ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# భిన్నత్వంలో ఏకత్వం

జొన్నలగడ్డ రామలక్ష్మి
9885620065

**పిహెచ్‌డీ దాకా వైజాగ్‌లో ఉన్న నేను, రీసెర్చ్ అసోసియేట్‌గా చేరడానికి మొదటి సారిగా ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ వెళ్లాను.**

**ట్రైన్ దిగి రిక్షాలో రీసెర్చ్ లేబొరేటరీ కాలనీ గేటు దాకా వెళ్లి, అక్కడున్న గూర్ఖాని - నేను కలసి పని చెయ్యబోయే సైంటిస్ట్ సుందర్రావు అడ్రస్ అడిగాను.**

**అతడు కొంత హిందీలో, కొంత చేతి సైగల్లో చెప్పిందాన్ని బట్టి ముందుకెళ్లి రెండు సందులు తిరిగి, ఓ యింటి ముందు ఆగి తలుపు తట్టాను.**

ఓ నడివయస్కుడు వచ్చి, సుందర్రావు పేరు చెప్పగానే... 'తెలుగువాడివా?' అని ఒరియాలో అని, లోపలకు తీసుకుపోయి చాయ్ ఆఫర్ చేసి, ఆ తర్వాత తనింటి పక్కనే వున్న తెలుగు వాడింటికి పంపాడు.

ఆ తెలుగతను ఆప్యాయంగా పలకరించి,

తనూ చాయ్ ఆఫర్ చేసి... "ఈ రోడ్డుకి సమాంతరంగా ఉన్న నాలుగో సందులో రెండో ఇల్లు సుందర్రావుది. ఇంటిముందు ఎప్పుడూ ఓ ఆవు కూర్చుని ఉంటుంది. సులభంగా గుర్తుపట్టొచ్చు." అన్నాడు.

లెక్క పెట్టుకుంటూ వెళుతూ వుంటే, మూడో సందులోనే ఓ ఇంటిముందు తాపీగా ఆవు ఒకటి కూర్చొనుంది. నా లెక్క తప్పిందో, ఇందాకటాయన తప్పు చెప్పాడో అనుకుంటూ అక్కడికి వెళితే, ఇంటాయన బయటే ఉన్నాడు.


సుందర్రావు పేరు చెప్పగానే అతడు కూడా 'తెలుగువాడివా?' అని ఒరియాలో అడిగి లోపలకు తీసుకెళ్లి చాయ్ ఆఫర్ చేసి... సుందర్రావు ఇల్లు పక్క సందులో అని చెప్పాడు.

అయితే ఇంకో రెండిళ్ళలో చాయ్ తాగాక కానీ సుందర్రావు ఇల్లు దొరకలేదు. ఇంతకీ అతడింటి ముందు ఆవు లేదు. పరస్పరం పరిచయాలవగానే... అతడి భార్య " కాఫీ తాగుతారా?... టీ తాగుతారా?" అని అడిగింది.

ప్రాణం లేచి వచ్చింది.

"అమ్మమ్మమ్మ! ఇన్ని ఇళ్ళకి వెళ్లా. అపరిచితులు కూడా మొహమాటపెట్టి టీ ఇవ్వడమే... ఇంత వరకూ కాఫీ మాట ఎత్తినవాళ్ళే లేరు. జీవితంలో ఒక్కసారైనా టీ తాగనివాణ్ణి! కాఫీ గతప్రాణిని. టీ తాగి తాగి నోరు ఏదోలా అయిపోయింది... నాకు కాఫీయే కావాలి." అనేసాను.

సుందర్రావు వెంటనే–"జర్మన్స్‌కి బీరు, ఒరియా వాళ్ళకి చాయ్... రోజంతా అలా తాగుతూనే ఉంటారు. ఇంటికి వస్తే చాలు. అడ్రస్ కోసం వచ్చిన అపరిచితుడినైనా ముందు టీ ఇచ్చి... తర్వాతే పంపడం ఇక్కడి రివాజు. ఆఫీసులోనూ ప్రతి అరగంటకీ టీ సరఫరా ఉంటుంది. కాఫీ ఊసుండదు. 'ఫ్రీగా వస్తే ఎండ్రిన్ కూడా వదలకూడదు' అని కొందరు తెలుగువాళ్ళు కాఫీ నుంచి టీకి మారిపోయారు. ఏ అలవాటూ లేని కొందరు కొత్తగా టీ అలవాటు చేసుకున్నారు. అదీ సంగతి!" అన్నాడు.



"అమ్మో! ఏమో అనుకున్నా కానీ ఏకత్వంలో మరీ ఇంత భిన్నత్వమా? ఇక్కడ ఎలాగుంటు న్నారండీ బాబూ?" అన్నాను దిగులుగా.

"కాలనీలో నలభైకి పైగా తెలుగు కుటుంబా లున్నాయి. అంతా వెరీ హ్యాపీ. నేను వచ్చి పదేళ్ళయ్యింది... ఇంకా పాతికేళ్ళ సర్వీసు వుంది. బదిలీలు లేని సైంటిస్టు ఉద్యోగం కదా! రిటైర్మెంటుదాకా ఇక్కడే అని హ్యాపీగా ఫిక్సయి పోయాను. పరాయి ప్రాంతంలో ఉన్నాను అన్న భావనే రాదు ఇక్కడ. ఇక్కడివాళ్ళంతా ఎంతో స్నేహపాత్రులు" అన్నాడు సుందర్రావు.

నాకు నమ్మబుద్ధి కాలేదు.

సుందర్రావు నన్ను హాస్టల్‌కి తీసుకుని వెళ్లి, నాకు అని కేటాయించిన రూంలో చేర్చాడు.



మర్నాడు ఉదయం స్కూటరు మీద వెళ్తూ హాస్టల్ నుంచి పిక్ చేసుకుని లేబొరేటరీకి తీసుకుని వెళ్లి ముందు అడ్మినిస్ట్రేటివ్ డివిజన్‌లో ఓ తెలుగు ఆఫీసరు వద్దకు తీసుకెళ్ళి జాయినింగ్ ఫార్మాలిటీస్ పూర్తి చేయించాడు.


లైబ్రరీకి తీసుకెళితే... లైబ్రేరియన్ తెలుగాయన... స్టోర్స్ సెక్షన్‌లో ఆఫీసరు తెలుగాయన... అలాగే వర్క్‌షాప్‌లో ప్లాంట్ ఇంజనీరు తెలుగాయన...మినరల్ డివిజన్‌లో శాస్త్రి, మెటలర్జీలో భాస్కరం, ఎలక్ట్రానిక్స్‌లో స్వామి, ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ప్రసాద్... ఇలా ఎక్కడికి వెళ్లినా అక్కడ తెలుగువాళ్ళే కనిపించి చక్కని తెలుగులో మాట్లాడి పరిచయం చేసుకుని... అన్నింటా తమ సహకారం అందిస్తామని మాటిచ్చి, శుభాకాంక్షలు చెప్పి పంపారు.

నాకు థ్రిల్లింగ్‌గా అనిపించింది.

వచ్చింది ఒరిస్సా రాజధానికి... కాని నేను న్నది అచ్చ తెలుగు వాళ్ళ మధ్యలో అనిపిస్తోంది.

నా మనోభావాలు పసికట్టాడో ఏమో– "ఇది నేషనల్ ఇన్‌స్టిట్యూట్. అన్ని సెక్షన్లలోనూ అన్ని భాషలవాళ్ళూ ఉంటారు. కొత్తవాళ్ళు వచ్చినప్పుడు ఏ భాషవారిని ఆయా భాషలవారికి పరిచయం చెయ్యడం రివాజు" అన్నాడు.

చివరగా సుందర్రావు మా కెమిస్ట్రీ డివిజన్‌కి తీసుకెళ్లి... మా పెద్ద బాస్ భరత్‌కి నన్ను పరిచయం చేసేంతలో నేనే చొరవగా– "నా పేరు ఈశ్వర్. ఈ రోజే మీ డివిజన్‌లో రీసెర్చ్ అసోసియేట్‌గా జాయినయ్యాను. పరాయి ప్రాంతానికి రావడం ఇదే మొదటిసారి. కానీ ఇక్కడికి వచ్చాక ఇదీ తెలుగు నేలే అనిపించింది..." అని ఆయన మొహం బ్లాంక్‌గా ఉండడం చూసి ఆగిపోయాను.




పెద్ద బాస్ కదా! నేను అంతలా మాట్లాడడం నచ్చలేదేమో... అనుకున్నాను!

అంతలో సుందర్రావు– "హి ఈజ్ అవర్ హెడ్ ప్రొఫెసర్ భరత్! హి ఈజ్ ఫ్రం మహారాష్ట్ర!" అని..."ఈశ్వర్ అవర్ న్యూ అసోసియేట్ ఫ్రం ఆంధ్రా యూనివర్సిటీ వైజాగ్!" అని నన్ను ఆయనకి పరిచయం చేసాడు.

వరుసగా తెలుగువాళ్ళని కలిసిన ఊపులో ఆయనా తెలుగువాడే అని పొరబడ్డానని అప్పుడు గ్రహించి సిగ్గుతో తల వంచుకున్నాను.

ప్రొఫెసర్ భరత్ చిన్నగా నవ్వి– "నువ్వు మా గ్రూపులో చేరినందుకు చాలా సంతోషం. నాతో కలసి ఓ కప్పు కాఫీ తీసుకుంటానంటే ఇంకా సంతోషిస్తాను. సుందర్రావుకి మైనర్ వైసెస్ లేవు. నాకు కాఫీకి కంపెనీ లేదు!" అన్నాడు.

రోజూ తన రూంలో కాఫీ కలుపుకుంటాడు.

చాయ్ వల్ల ఏకత్వంలో భిన్నత్వాన్ని చూసి బెదిరిపోయిన నాకు కాఫీ భిన్నత్వంలో ఏకత్వాన్ని చూసి ఆదరించింది.

నా ప్రవాస జీవితంలో ఈ తొలి అనుభవం ఎన్నటికీ మరువలేనిది.

# నెల నెలా నవ్వుల వెన్నెల





**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం** మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.

## ఈ నెల అంశం- దసరా సరదా
























ఈయనే కాంతం...నా చేత పది నిముషాలు గెంతులేయించి,పైసలివ్వ లేదు!!
భీం రావ్. పహిల్వాన్.


వెరైటీ గా ఉంటుంది కదా అని పులికి బదులుగా దీని వేషం వేస్తే జనాలు తంతారండీ అంటే వినిపించుకున్నారా..!



ఆ బార్బర్ షాపు అతను దసరా మామూలు అడిగినప్పుడు నువ్వు ఇవ్వనని చెప్పకుండా ఉండాల్సింది సుబ్బారావ్...
BUS STOP
వి. బాలకృష్ణ


వచ్చిన దసరా మామూళ్ళ కంటే... మామూళ్ళ కోసం తిరిగితే వచ్చిన 'కరోనా'.....కే ఎక్కువ ఖర్చయ్యింది... బాపిన్నీ!


బాబూ! దక్షిణ అడిగితే నేను పూజ చేయించిన ఆ యుద్ధాన్నే చూపించడం మీకు భావ్యంగా వుందా?!
Sitaram...


ప్రతి వేషం నకు సరదా అయితే మాత్రం నువ్వు వెయ్యకూడదు..


అయ్యవార్లకు చాలు పియ్యార్సీ డియ్యేలు-పిల్లవాళ్ళకి చాలు కరోనా సెలవులు
Sridhar


దసరా పండక్కి స్కూటర్ అడిగితే మా వాళ్ళు ఇచ్చారు,
ఆయనకి నడపడం రాదు కదా ఎంచక్కా మనం రోజూ ఆఫీస్ కెళ్ళడానికి ఉపయోగ పడుతోంది!
BUS STOP



శ్రీ కొయిలాడ వెంకునాయుడు గారి జ్ఞాపకార్థం ప్రవాసాంధ్రులు అంశంతో నిర్వహించిన మినీ హాస్య కథల పోటీలో **ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# దుబాయ్ దుర్గమ్మ

కె.వి. లక్ష్మణరావు,
9014659041

**సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం మాట.**

**దుర్గమ్మ దుబాయ్ నుండి తూర్పుగోదావరి జిల్లాలో తన పల్లెటూరుకి వచ్చి నేటికి ఐదు రోజులయ్యింది.**

**అక్కడ దుబాయ్‌లో పెట్రోలు బంకు యజమానురాలింట్లో అంట్లు తోమే పనిమనిషిగా చేరింది. కొన్నేళ్ళు పనిచేసి వచ్చేసింది.**

**కానీ దుబాయ్‌లో పెద్ద ఉద్యోగం చేసి వచ్చిందంటూ చుట్టుపక్కల అమ్మలక్కలు రోజూ దుర్గమ్మ ఇంటికి రావడం... పోవడం చేస్తున్నారు.**

అప్పటివరకూ దుర్గమ్మ అత్తగారైన నరసమ్మతో పిచ్చాపాటీ మాట్లాడేవాళ్ళంతా... దుర్గమ్మతోనే మాట్లాడుతూ, నరసమ్మను చూసి బాగోదని మామూలుగా నవ్వి వెళ్లిపోతున్నారు.

'ముందొచ్చిన చెవుల కన్నా... వెనకొచ్చిన కొమ్ములు వాడి' అనే సామెత మీలాంటోళ్ళను చూసే పుట్టిందే?' అమ్మలక్కలను చూసి నోరెళ్ళ బెడుతూ నరసమ్మ మనసులో అనుకుంది.

పైకి తల్లీకూతుళ్ళలా అనిపించినా అత్తాకోడళ్ళ మధ్య ఓ విభజన రేఖ ఉంటుంది... ఆ రేఖ పెద్దయ్యేకొద్దీ ఇద్దరినీ విభజిస్తూనే ఉంటుంది.

ఆ రేఖకు స్నేహితులే- ఎత్తి-పొడుపులు, పుల్లవిరుపు మాటలూనూ!

అమ్మలక్కల కళ్ళు పచ్చపువ్వుల్లా విచ్చుకుంటున్నాయి.

"భలేగా ఉన్నాయ్ దుర్గమ్మా...మనూరి జమిందారు గారింట్లో కూడా ఇలాంటి ఫ్రిజ్ లేదనుకో!"


దుర్గమ్మ ఇచ్చిన ఫ్రిజ్ నీళ్ళు గడగడా తాగేసి గొప్పగా అంటున్నారు అమ్మలక్కలు.

దుర్గమ్మ వారి మాటలకు పొంగిపోయింది.

పొగిడినవారికీ, పొగడనివారికీ కూడా ఒక్కో సీసా ఇచ్చేస్తోంది.

"మా దుర్గమ్మ తెచ్చిన వస్తువులు చూడటమేనా? దుబాయ్‌లో ఏ ఉద్యోగం వెలగబెట్టిందో అడిగేది లేదా?..." నరసమ్మ ఉండబట్టలేక అనేసింది.

'గదులు తుడిచాను, ఇల్లు కడిగాను, అంట్లు



తోమానని... నిజం చెబితే, తాను దుర్గమ్మ ఎందుకవుతుంది?'

"పదో తరగతి పాసయ్యాను కదా! పెట్రోలు బంక్‌లో లెక్కలు రాసేదాన్ని!"... గుమస్తా ఉద్యోగం దర్జాగా చేసి వచ్చాను!" అంది దర్పంగా.

'సినిమా హీరోయిన్ మేకప్ వేసుకుని కవర్ చేసినట్టు బాగానే కవర్ చేసావే!' నరసమ్మ అనుకుంది.

'దుర్గమ్మా మజాకా!' అన్నట్టుగా నరసమ్మ కేసి కొరకొరా మంటూ చూసింది దుర్గమ్మ.


నిన్నటివరకూ కప్పుతో కందిపప్పు, గిన్నెతో పంచదార అప్పుగా పట్టుకెళ్ళిన అమ్మలక్కలే కోడలిని తన కళ్ళెదుటే కొండపైన కూర్చోబెట్టి పొగిడేస్తుంటే నరసమ్మ మనసు తట్టుకోలేక పోతోంది.

అందరిముందూ కోడలి ప్రభావం తగ్గించాలి... తన ప్రాభవం, గత వైభవం పెంచుకోవాలి.ఎలా?అనుకుంటూ చుట్టూ చూసింది నరసమ్మ.

దుబాయ్ నుంచి అమ్మ తెచ్చిన కీ ఇచ్చే కారుతో ఆడుకుంటున్న తన ఐదేళ్ళ మనవడు పద్దూను దుర్గమ్మ మీద ప్రయోగించాలనుకుంది నరసమ్మ.

"ఒరేయ్ పద్దూ! నీ కోసం అమ్మ బోలెడు బట్టలు తెచ్చిందట! వెళ్ళి తొడుక్కో!" అంటూ కీ ఇచ్చే కారుని తన చేతుల్లోకి తీసుకుంది నరసమ్మ.

"అమ్మా! కొత్త బట్టలు తొడగవా?" అంటూ




పద్దు దుర్గమ్మని అడిగాడు.

కొడుకు కోసం తెచ్చిన బట్టలన్నీ పొట్టయిపోయాయని... ఒక్కటీ సరిపోవడం లేదని దుర్గమ్మ నిన్న బాధ పడడం నరసమ్మకు తెలుసు. 'దుబాయ్‌లో ఇంట్లో వాళ్ళు వాడి పడేసిన సెకండ్ హ్యాండ్ వస్తువులను ఇక్కడ గొప్పగా ప్రదర్శిస్తూ... పెద్దగా ఫోజు కొడతావా? ఇప్పుడు చూస్తా నువ్వేం చేస్తావో... ' అనుకుంది నరసమ్మ.

అమ్మలక్కలు చూస్తుండగానే పద్దూకు టీ షర్ట్‌ను పైనుండి తొడుగుతోంది దుర్గమ్మ.

"చూసారామ్మా! కన్న కొడుక్కి సరిపోయే బట్టలు తేవడం కూడా రాదు కానీ, దుబాయ్ వెళ్ళొచ్చానని గొప్పగా ఫోజు కొడుతోంది" నరసమ్మ మాట పేల్చేసింది.

కానీ దుర్గమ్మ ఏమాత్రం ఆవేశ పడలేదు.

"నీ ఆత్రం తీరిందా అత్తా?..." అన్నట్టుగా అత్తకేసి చూసింది.

"చూడండమ్మా! దుబాయ్ వెళ్ళే ముందు మల్లెతీగలా సన్నగా ఉండే నా పద్దూకు మా అత్త అడ్డమైనవన్నీ పెట్టేసి రోడ్డు రోలరులా చేసేసింది. ఈ బట్టలు సరిపోయేలా వాడి బరువు తగ్గించాలనే ఇవి తెచ్చాను. కన్నతల్లిని, కన్నకొడుకు గురించి ఆ మాత్రం ఆలోచించ(లే)నా?" అందరితో అంది.

"భలేగా చెప్పావ్ దుర్గమ్మా! నువ్వెప్పుడూ కరెక్టే!" అమ్మలక్కలందరూ చప్పట్లు చరిచారు.

నరసమ్మ అహం దెబ్బతింది.

కొంతసేపు మౌనం వహించింది.


అమ్మలక్కలు సెంటు సీసాలతో వెళ్ళిపోయారు.

నరసమ్మ దుర్గమ్మతో- "కోడలా! అందరూ నిన్ను పొగిడేస్తుంటే దిష్టి తగులుతుందే... అందుకే నిన్ను తిడుతున్నట్టు నటించాను. నిజంకాదు!" అంది చిన్నగా నవ్వుతూ. బదులుగా దుర్గమ్మ కూడా నవ్వింది.

ప్రస్తుతం...

గదిలో గోడకు వేలాడుతున్న నరసమ్మ ఫోటో కేసి చూస్తూ దుర్గమ్మ అంటోంది.

అత్తా! ఆ రోజు నువ్వు నాతో ప్రేమ నటించావు. కానీ నేనంటే నీకు అసూయేనని నాకిప్పుడు తెలుస్తోంది. ఎందుకంటే ఇప్పుడు నేనూ అత్తనయ్యానుగా!



# దేవుడు కనబడడు!




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

## ప్రతినెలా ఆరోగ్యకరమైన హాస్యంతో వెలువడుతున్న
## ఏకైక హాస్య మాస పత్రిక హాస్యానందం

### ఇంటిల్లిపాదినీ నవ్వించే పని పెట్టుకున్న
### ఏకైక హాస్య పత్రిక




- ✦ సంవత్సర చందా- రూ.300/-
- ✦ 2 సంవత్సరాల చందా- రూ.500/-

మీ చందాని గూగుల్ పే / ఫోన్ పే ద్వారా పంపించి, మీ చిరునామా మా వాట్సాప్ నెంబరుకు పంపగలరు. మీరు పంపవలసిన నెంబరు- **9849630637**


## జీవిత చందా
## ₹ 5000/-

✦ వీరికి పత్రిక ప్రతినెలా రిజిష్టర్ పోస్ట్‌లో పంపబడుతుంది.

✦ సంవత్సరంలో 'మీ' కోరిక మేరకు 'శుభాకాంక్షలు' ప్రకటన పత్రికలో ప్రచురిస్తాం.

*Hasyanandam*
#8-215/4, Near Ramalayam,
YERRABALEM-522 503, Mangalagiri, Guntur Dist.
Ph: 9849630637. email: hasyanandam.mag@gmail.com

Hasyanandam October 2021. RNI No. APTEL 08387/01/1/2003-TC



చవకబారు వస్తువులు విలువైనవి
కావు...
విలువైన వస్తువులు చవకగా
ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548